**విలేఖరులు కావలెను**

ప్రత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు
సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న
మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్
మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా
విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల
సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా
విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

నిరంతర వార్తా ప్రవాహం

# జనసముద్రం న్యూస్

ప్రతి అక్షరం జనం కోసం

Save Farmers

JANASAMUDRAM.COM

సంపుటి:04 | సంచిక:363 | శుక్రవారం సెప్టెంబర్ 11,2026 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00


## 15వేల మంది పోలీసులు.. 500 సీసీటీవీలు.. బ్రిక్స్ సదస్సుకు భారీ భద్రత

బ్రిక్స్ సదస్సు కు దేశ రాజధాని దిల్లీ నగరం సిద్ధమైంది. ఈనెల 12, 13 తేదీల్లో ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు ప్రపంచ దేశాల అగ్రనేతలు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో దిల్లీ అధికారులు, పోలీసులు అప్రమత్తమయ్యారు.



మిగతాది 2లో

# బ్రిక్స్ సదస్సు: సస్పెన్స్‌కు తెర.. భారత్‌కు జిన్‌పింగ్!

### బ్రిక్స్ సదస్సుకు జిన్‌పింగ్ రాక ఖరారు

- ఈ నెల 12, 13న దిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు
- జిన్‌పింగ్ రాకపై కొనసాగిన సస్పెన్స్‌కు తెర
- చైనా ప్రభుత్వ మీడియా జిన్హువా అధికారిక ప్రకటన
- సదస్సు సందర్భంగా మోదీ--జిన్‌పింగ్ భేటీకి అవకాశం
- భారత్--చైనా ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిగే అవకాశం



మిగతాది 2లో

## ఆ వీడియోలను నమ్మి మోసపోవద్దు - ప్రియాంక కార్యాలయం హెచ్చరిక

- కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా పేరుతో సామాజిక మాధ్యమాల్లో నకిలీ వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి.



మిగతాది 2లో

# బీఆర్ఎస్ కుట్రలను బలంగా తిప్పికొట్టాలి: సీఎల్పీ భేటీలో సీఎం రేవంత్

- ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- సభను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ కుట్ర చేసిందని సీఎం ఆరోపణ

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం అధ్యక్షతన సీఎల్పీ భేటీ జరిగింది. ఈ సమావేశంలో సీఎం పలు సూచనలు చేశారు. "వెయ్యి రోజుల పాలనను ప్రజలకు వివరించాలని అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నాం. సభ జరగనివ్వకుండా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కుట్ర చేసింది. ఆ పార్టీకి అధికారం పోయినా అహంకారం పోలేదు. పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించి సభను సజావుగా జరగకుండా చేశారు. మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించారు. స్పీకర్‌ను అత్యంత అభ్యంతరకరంగా దూషించారు. ప్రతిపక్షం కుట్రలను బలంగా తిప్పికొట్టాలి. ప్రభుత్వంపై జరిగిన కుట్రను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారిని అభినందిస్తున్నా. ఎమ్మెల్యేలు సభకు హాజరై చర్చల్లో పాల్గొనాలి" అని రేవంత్ దిశానిర్దేశం చేశారు.



## చెరువుల్లో నిమజ్జనాలకు మేం వ్యతిరేకం కాదు: హైడ్రా కమిషనర్ రంగనాథ్



మిగతాది 2లో

## త్వరలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు: మంత్రి పొన్నం



మిగతాది 2లో

## ఆ రెండు పార్టీలు అలజడి సృష్టిస్తున్నాయి: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



హైదరాబాద్: బయట భారాస.. సభ లోపల భాజపా గందరగోళం సృష్టిస్తున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. రెండు పార్టీలు సభా సమయాన్ని వృథా చేస్తున్నాయని మండిపడ్డారు. "ప్రజా సమస్యలపై చర్చలు జరిపి పరిష్కారాలు కనుగొనాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే.. రెండు పార్టీలు కుయుక్తులు పన్ని సభలో అలజడి సృష్టిస్తున్నాయి. ఇప్పటికే 3 రోజులు వృథా.. ప్రజా సమస్యల కంటే ఫక్తు రాజకీయాలు చేసే యత్నం మాను కోవాలి. పేజి 2లో








మిగతాది 2లో

## ఏపీలో మద్యం రవాణా కేసు.. వాసుదేవరెడ్డి, రాజ్‌కెసిరెడ్డిలకు చుక్కెదురు

- మద్యం రవాణా కేసులో నిందితులకు చుక్కెదురు
- వాసుదేవరెడ్డి, రాజ్ కెసిరెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్లు కొట్టివేత
- ఇరువురు ఇప్పటికే ఈడీ కస్టడీలో ఉన్నట్లు వెల్లడి
- కొత్త ఎఫ్ఐఆర్‌పై నిందితుల తరపు న్యాయవాదుల అభ్యంతరం
- రెగ్యులర్ బెయిల్ కోసం సంబంధిత కోర్టును ఆశ్రయించాలి

# ఫైళ్లు పెండింగ్‌లో ఉంటే అభివృద్ధి, పాలన పెండింగ్‌లో ఉన్నట్టే:

- ఫైళ్లు పెండింగ్ = పాలన పెండింగ్
- కలెక్టర్లలో లీడర్‌షిప్ స్కిల్స్ పెంచాలి
- ప్రోయాక్టివ్ గవర్నెన్స్ అందించాలి
- జిల్లాల్లో 25 టాప్ ప్రాజెక్టులు చేపట్టాలి
- 2027 నాటికి భూ వివాదాలు లేని ఏపీ
- వృద్ధిని 15 శాతానికి పెంచే లక్ష్యం
- రివ్యూల నుంచి రిజల్ట్స్ వైపు మారాలి
- ఇగోలు పక్కనపెట్టి ప్రజాసేవ చేయాలి
- పోలవరం 2027 మార్చి నాటికి పూర్తి చేయాలి



అమరావతి: ఫైళ్లు పెండింగ్‌లో ఉంటే అభివృద్ధి, పాలన కూడా పెండింగ్‌లో ఉన్నట్టేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పాలనకు కొత్త దిశ.. అధికార యంత్రాంగంలో లీడర్‌షిప్ స్కిల్స్‌పై అమరావతిలో జరుగుతున్న 8వ కలెక్టర్ల సదస్సులో సీఎం ప్రత్యేక దృష్టి పెట్టారు. అధికారులు, ఉద్యోగుల్లో నాయకత్వ పటిమ పెరిగితేనే ప్రజలకు పాలన మరింత వేగంగా, సమర్థంగా చేరుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో తొలిసారిగా లీడర్‌షిప్‌పై ప్రత్యేక సెషన్‌ను అజెండాలో చేర్చింది. పేజి 2లో ▶

# సంపాదకీయం

## వయోజనులు 103 కోట్లైతే, ఓటర్లు 88 కోట్లా?

అవునా?-- ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ దేశవ్యాప్తంగా అమలైనప్పుడు చట్టబద్ధమైన ఓటర్ల సంఖ్యకు సంభవించే మొత్తం నష్టానికి సంబంధించి మా తొలి అంచనాలపై చాలామంది ప్రతిస్పందన అది. ఒక సత్యాన్ని తెలుసుకున్నామన్న ఆశ్చర్యకరమైన భావన కొంతమంది స్పందనలో ధ్వనించగా మరి కొంతమంది ఆ ఏక పద ప్రశ్న రూప స్పందనలో మా అంచనాల పట్ల వ్యంగ్యాన్ని ధ్వనింపజేశారు. ఇదలా ఉంచి అసలు విషయానికి వద్దాం. బిహార్‌లో ఓటర్ జాబితాల నుంచి 65 లక్షల పేర్ల తొలగింపునకు సర్ దారితీసింది. ఆ ప్రకారం చూస్తే, దేశవ్యాప్తంగా దాదాపు పది కోట్ల మంది ఓటర్ల పేర్లను ఓటర్ జాబితాల నుంచి తొలగించేందుకు సర్ దారితీస్తుందని మేము అంచనా వేశాం. అయితే ఎవరూ మా మాటను విశ్వసించలేదు. అప్పటికీ మేము చేసిన హెచ్చరికల వల్లే బిహార్‌లో అంతిమ తొలగింపుల సంఖ్య చెప్పుకోదగిన స్థాయిలో తగ్గింది. సర్ అమలులో అసంగతాలపై మేము దేశ ప్రజలను అప్రమత్తం చేస్తూ వస్తున్నాము. ఇప్పుడు తుది గణాంకాలు వచ్చేశాయి. మొత్తం తొలగింపులు మేము ఊహించిన దానికంటే అత్యధికంగా ఉన్నాయి. దీనిపై మనం సత్వరమే మేల్కొనకపోతే మన ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది.

ప్రధాన రాష్ట్రాలకు సంబంధించిన ముసాయిదా సర్ ఓటర్ జాబితాల విడుదలను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) గతవారం పూర్తి చేసింది. నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల ముసాయిదా ఓటర్ జాబితాలను ఇంకా విడుదల చేయవలసి ఉన్నది. హిమాచల్ ప్రదేశ్, జమ్మూ--కశ్మీర్ రాష్ట్రాలలో సర్ ప్రక్రియ అమలు ఇంకా ప్రారంభం కాలేదు. అయినప్పటికీ దేశవ్యాప్త సర్ ఫలితాల ధోరణి స్పష్టంగా ఉంది. ముసాయిదా స్థాయిలో జరిగిన తొలగింపుల సంఖ్య 13 కోట్ల 37 లక్షలుగా ఉన్నది. ముసాయిదా జాబితాల విడుదల తరువాత మరికొంత మందిని జాబితాలలో చేర్చడం లేదా తొలగించడం సహజం కనుక సర్ అంతిమ జాబితాలలో తొలగింపుల సంఖ్య కొంచెం తక్కువగా ఉండవచ్చు. అదనపు చేర్పులు, సర్ ఇంకా ప్రారంభం కాని రాష్ట్రాలనూ పరిగణనలోకి తీసుకున్నప్పుడు భారత్ ఓటర్ జాబితాల నుంచి అంతిమ తొలగింపులు పన్నెండు కోట్లకు పైగా ఉండవచ్చునేది మా అంచనా.

ఈ విషయాన్ని మరింత లోతుగా, విశాలంగా చూద్దాం. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో భారతదేశ ఓటర్ల సంఖ్య 98 కోట్లుగా ఉన్నది. అదే కాలంలో వయోజనుల సంఖ్య (99 కోట్లు)కు ఓటర్ల సంఖ్య ఇంచుమించు సమానంగా ఉన్నది. సర్ లాంఛనంగా ముగిసే నాటికి భారతదేశ వయోజన జనాభా అంచనా 103 కోట్లుగా ఉంటుంది, అంతిమ జాబితాలలోని ఓటర్ల సంఖ్య 88 కోట్లకు తగ్గిపోతుంది. వయోజన జనాభాకు, ఓటర్ల సంఖ్యకు మధ్య ఇంత పెద్ద వ్యత్యాసానికి కారణమేమిటో నిశితంగా చూడవలసిన అవసరమున్నది. ఆ భారీ వ్యత్యాసం రెండు అవకాశాలను సూచిస్తుంది: ఒకటి-- బహుశా జనాభా అంచనా భారీగా వేసి ఉండాలి. అంటే అధికారిక అంచనాలలో ఉన్నట్లుగా 145 కోట్లకు పైగా కాకుండా భారత జనాభా 125 కోట్ల లోపే ఉండి ఉండాలి. రెండు-- ఓటు వేసే వయసుగల 15 కోట్ల మంది యువత ఓటర్ జాబితాల నుంచి గల్లంతవడం. వీటిలో ఏది నిజం? ఏది నిజమైనప్పటికీ ఆ 'వాస్తవం' అక్షరాలా ఒక లజ్జాకర విషయమని చెప్పక తప్పదు.

సర్ ప్రక్రియలో తొలగింపులు అన్నీ తప్పుడువేనని భావించనవసరం లేదు. ప్రస్తుత ఓటర్ జాబితాలలో లొసుగులు, నకిలీ పేర్లు చాలా ఉన్నాయి. కనుక తొలగింపులలో అత్యధిక భాగం న్యాయబద్ధమైనవేనని అంగీకరించాలి. అయినప్పటికీ మూడోవంతు తొలగింపులు సక్రమమైనవి కాకపోయినా ఓటర్ జాబితాలు తారుమారు కావడమనేది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాని స్థాయిలో జరిగిందనే వాస్తవాన్ని మనం గుర్తించాలి.

ఓటు హక్కు ఉన్నప్పటికీ వివిధ కారణాల వల్ల దాన్ని పూర్తిగా ఉపయోగించుకోలేనివారు, అసలు ఓటు హక్కు అందుబాటులోకి రానివారిని కూడా పరిగణనలోకి తీసుకోవల్సివుంది. సర్‌కు పూర్వపు జాబితాలలో లేని అర్హులైన ఓటర్లు కోట్ల సంఖ్యలో ఉన్నారు. వారిలో చాలామంది పేర్లను సర్ ప్రారంభం కాకముందే జాబితాల నుంచి తొలగించారు. ఈ అవకతవకలన్నిటినీ సర్ సరిదిద్దలేదు. దీన్నిబట్టి వయోజన జనాభా సంఖ్యకు, ఓటర్ల సంఖ్యకు మధ్య భారీ వ్యత్యాసం ఎందుకు ఉన్నదో అర్థమవుతుంది.

మరి ఆ వ్యత్యాసం సర్ తదుపరి దశలలో క్రమేణా తగ్గిందా? లేదు. లేకపోగా ప్రతి దశలోనూ ఓటర్ తొలగింపుల విస్తృతి, స్వభావం మరింత ప్రతికూల మార్పులకు లోనయ్యాయి. 'సర్'ను తొట్ట తొలుత బిహార్‌లో అమలుపరిచారు. అది తొలి మార్గదర్శక దశ. బిహార్‌కే పరిమితమైన ఆ దశలో ఓటర్ జాబితాల నుంచి తొలుత 65 లక్షల పేర్లను తొలగించారు. అయితే న్యాయవ్యవస్థ జోక్యంతో ఆ తొలగింపులు అంతిమంగా 45 లక్షలకు తగ్గిపోయాయి. బిహార్ తరువాత 13 రాష్ట్రాలలో సర్ రెండో దశ ప్రారంభమయ్యే నాటికే ఆ ప్రక్రియ పట్ల ప్రజలు ఉదాసీనత వహించారు. రాజకీయ పక్షాలు ఉపేక్షాభావం చూపాయి. అప్పటికే బిహార్ ఎన్నికలు జరిగిపోయినందున ప్రజలు 'సర్'కు అలవాటుపడ్డారు. ఓటర్ల సంఖ్యలో దాదాపు 13శాతం తగ్గుదలను చాలావరకు ఎవరూ ప్రశ్నించలేదు. అయితే పశ్చిమ బెంగాల్‌లో ముస్లిం ఓటర్ల తొలగింపు మీద మాత్రం జాతీయ స్థాయిలో పౌరసమాజం దృష్టి పెట్టింది. సర్ అమలు తీరుతెన్నులపై సంపూర్ణ నిర్ణయాధికారం ఎన్నికల సంఘానిదేనని సుప్రీంకోర్టు ఒక తీర్పులో స్పష్టం చేసింది. దీంతో ఎన్నికల సంఘం ఆ ప్రక్రియను తాను నిర్ణయించుకున్న రీతిలో అమలుపరిచింది. మూడో దశ ముసాయిదా సర్ జాబితాలలో ఓటర్ల తొలగింపులు 17శాతానికి పైగా పెరిగాయి!

సర్ మూడో దశ అమలైన హర్యానా, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణతో పాటు ఢిల్లీలో ఓటర్ల తొలగింపులు అసాధారణంగా అత్యధిక సంఖ్యలో చోటుచేసుకున్నాయి. మూడు దశలలోను 'మృతుల' కేటగిరీలోని ఓటర్ల నిష్పత్తి స్థిరంగా ఉన్నది. మొత్తం తొలగింపులలో 'మృతుల' తొలగింపులు ఇంచుమించు 3శాతంగా ఉన్నాయి. ఇవి కాకుండా 'అందుబాటులో లేకపోవడం' (ఆబ్సెంట్), 'వలస వెళ్లడం' (షిఫ్టెడ్) కారణాలతో కూడా పెద్ద ఎత్తున ఓటర్లను తొలగిం చారు. గమనార్హమైన విషయమేమిటంటే ఆబ్సెంట్, షిఫ్టెడ్ కేటగిరీలను ఇప్పటివరకు స్పష్టంగా నిర్వచించలేదు. దీంతో స్థానిక ఎన్నికల అధికారులు తమకు తోచిన విధంగా ఆ కేటగిరీలను ఉపయోగించారు. ముసాయిదా ఓటర్ జాబితాల నుంచి తొలగింపునకు గురైనవారే కాకుండా అదనంగా మరో అయిదోవంతు మంది ఓటర్లు 'అన్ మ్యాప్డ్' (జాబితాలో చేర్చని) లేదా 'లాజికల్ డిస్క్రిపెన్సీ' (తార్కిక వ్యత్యాసం) కారణాల వల్ల మరింత పరిశీలనను ఎదుర్కోవలసి ఉంటుంది. ఒడిషా, జార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాల్లో 'తార్కిక వ్యత్యాసం' నిష్పత్తి అసాధారణంగా హెచ్చుస్థాయిలో ఉన్నది. కారణమేమిటి? కంప్యూటర్ అల్గారిథమ్ కంటే మరేదో పెద్ద కారణం ఉందని చెప్పక తప్పదు. అటువంటి వ్యత్యాసాలను ఎలా పరిష్కరించాలనే దానికి సంబంధించి ఎలాంటి ప్రామాణిక కార్యాచరణ విధానం కూడా లేదు. నిష్కర్షగా చెప్పాలంటే 'లాజికల్ డిస్క్రిపెన్సీ' అనేది ఒక పద్ధతి కాదనేది స్పష్టం. ఉద్దేశపూర్వకంగా రూపొందించిన, అనుసరిస్తున్న ఒక ఏకపక్ష వైఖరి.సర్ మూడో దశలో ఒక కొత్త దురాచారం ఆరంభమయింది: చాలా రాష్ట్రాలలో సర్ ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కాకముందే ఓటర్ జాబితాల నుంచి పెద్ద ఎత్తున తొలగింపులు జరిగాయి. వీరు మళ్లీ ఓటర్‌గా నమోదయ్యేందుకు వీలుగా కనీసం ఒక ఎన్యూమరేషన్ ఫామ్‌ను సైతం అందుకోలేదు. వారి తొలగింపులు చాలా అనామకంగా జరిగిపోయాయి. 'ఇవి సర్ తొలగింపుల కిందకు రావు' అనేది గమనార్హమైన వాస్తవం. సర్ మూడో దశకు షెడ్యూలు ప్రకటించిన మే 12, సర్ అధికారికంగా ప్రారంభమైన రోజుకు మధ్య 14 లక్షల మందికి పైగా ఓటర్ల పేర్లను ఓటర్ జాబితాల నుంచి తొలగించారు. వీటిలో అత్యధిక భాగం --8 లక్షలు-- మహారాష్ట్రలో జరిగాయి. 2025 ఫిబ్రవరిలో అసెంబ్లీ ఎన్నికల అనంతరం, 2026లో సర్ ప్రక్రియ అమలు ఆరంభం మధ్య కాలంలో ఢిల్లీలో ఓటర్ల సంఖ్య 11 లక్షలకు పైగా తగ్గిపోయింది. ఇదీ కారణం అని చెప్పేందుకు వీలుకాని పరిణామమిది. గత ఏడాది 1.56 కోట్లుగా ఉన్న ఢిల్లీ ఓటర్ల సంఖ్య సర్ ముసాయిదా ఓటర్ జాబితాల విడుదల నాటికి 98 లక్షలకు తగ్గిపోయింది.ఇవన్నీ స్పష్టం చేస్తున్నదేమిటి? సర్ డేటా అవకతవకలమయంగానూ, అసంబద్ధంగానూ ఉన్నది. డేటా క్రమరాహిత్యం, అసంగతాన్ని మాత్రమే మనం ఎదుర్కొనడం లేదు. సర్ రూపేణా ఎన్నికల ప్రజాస్వామ్య పునాదులనే పునర్నిర్మించేందుకు ప్రయత్నం జరుగుతోంది. ఇది ప్రజాస్వామ్య నైతికతకు విరుద్ధం. 'సర్' రూపకల్పన, అమలు, ఫలితాలతో సహా మొత్తం ప్రక్రియపై పూర్తి స్థాయి బహిరంగ తనిఖీ (పబ్లిక్ ఆడిట్) జరిగి తీరాలి. ఇది అత్యవసరం.

## ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం..

మొదటిపేజీ తరువాయి

విజయవాడ: అమరావతిలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో రెవెన్యూ సంస్కరణలపై మంత్రి అనగాని సత్యప్రసాద్ కీలక ప్రకటనలు చేశారు. నిబంధనల ప్రకారం ఉన్న 9 లక్షల ఎకరాల ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లకు ఇవాళ్టి నుంచి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అక్రమాలు చోటుచేసుకున్న 4 లక్షల ఎకరాలపై సమగ్ర విచారణ చేపడుతున్నామని, గత ప్రభుత్వం 22-ఏలో చేర్చిన 28 లక్షల ఎకరాలను ఇప్పటికే నిషేధిత జాబితా నుంచి తొలగించామని చెప్పారు. 22-ఏ నుంచి భూముల తొలగింపును సులభతరం చేసేందుకు జీవో 444, కొత్తగా భూములను 22-ఏలో చేర్చే విధానాన్ని స్పష్టం చేస్తూ జీవో 445 జారీ చేశామని వివరించారు. భూమి హక్కులకు శాశ్వత పరిష్కారం చూపేందుకు 'మీ భూమి-బ్లాక్‌చెయిన్' టెక్నాలజీ ప్రాజెక్టును అమలు చేస్తున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

## ఆ రెండు పార్టీలు అలజడి సృష్టిస్తున్నాయి:

మొదటిపేజీ తరువాయి

స్పీకర్‌పై జరిగిన అవమానంపై చర్చ జరపాలంటే బీఆర్ఎస్ చర్చించదు. 22ఏపై చర్చ జరపాలంటూ సభలో గందరగోళం సృష్టించేందుకు భాజపా యత్నిస్తోంది. ప్రతి ప్రజా సమస్యపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని ఆది శ్రీనివాస్ తెలిపారు.

## చెరువుల్లో నిమజ్జనాలకు మేం వ్యతిరేకం కాదు: హైడ్రా కమిషనర్ రంగనాథ్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: నగరంలో గణేశ్ నిమజ్జనాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. చెరువుల్లో నిమజ్జనాలకు హైడ్రా వ్యతిరేకం కాదన్నారు. సోషల్ మీడియాలో హైడ్రా పై దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు.

"కేంద్రం నోటిఫై చేసిన 4-5 చెరువుల్లోనే గణేశ్ నిమజ్జనంపై ఆంక్షలు ఉన్నాయి. అమీన్‌పూర్, కాప్రా చెరువుల్లో ఆంక్షలు విధించారు. దేశంలో ప్రప్రథమంగా అమీన్‌పూర్ చెరువును బయోడైవర్సిటీగా, నేచరల్ వెట్‌ల్యాండ్ కింద కాప్రా చెరువును కేంద్రం గుర్తించింది. హైడ్రా పునరుద్ధరిస్తున్న చెరువుల వద్ద ఎలాంటి ఆంక్షలు లేవు. మట్టి విగ్రహాలను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం. పీవోపీ విగ్రహాల నిమజ్జనం కోసం ప్రతి చెరువు వద్ద ప్రత్యేక స్థలం కేటాయిస్తున్నాం"అని రంగనాథ్ తెలిపారు.

## త్వరలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు: మంత్రి పొన్నం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: గత ప్రభుత్వం హయాంలో ఆర్టీసీ మూసివేసే పరిస్థితి ఉండగా.. ఇప్పుడిప్పుడే గాడిన పడుతోందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొన్నం సమాధానాలిచ్చారు. పీఎం ఈడ్రైవ్ కింద హైదరాబాద్ నగరానికి 2,200 బస్సులు రాబోతున్నాయని చెప్పారు. ఆర్టీసీలో కార్మిక సంఘాల ఎన్నికలను గత ప్రభుత్వం రద్దు చేసిందన్న మంత్రి.. త్వరలో ఎన్నికల తేదీపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. "కొత్త ఈవీ పాలసీ తీసుకొచ్చాం. హైదరాబాద్ నగరానికి 100 మినీ బస్సులు రాబోతున్నాయి. వాటిలో 50 పాతబస్తీకి, మరో 50 బస్సులు ఎంఎంటీఎస్, మెట్రోతో అనుసంధానిస్తాం. 347.47 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం పొందగలిగారు. ఇది ఒక చరిత్ర" అని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## ఏపీలో మద్యం రవాణా కేసు.. వాసుదేవరెడ్డి, రాజ్‌కెసిరెడ్డిలకు చుక్కెదురు

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: వైకాపా హయాంలో జరిగిన మద్యం రవాణా కుంభకోణం కేసు లో నిందితులుగా ఉన్న ఏపీఎస్‌బీసీఎల్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, రాజ్ కెసిరెడ్డిలకు సుప్రీంకోర్టు లో చుక్కెదురైంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం దాఖలు చేసిన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. నిందితులు ఇప్పటికే ఈడీ కస్టడీలో ఉన్నట్లు ఇరువురి తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. రవాణా కుంభకోణం అంటూ కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని నిందితుల తరఫు న్యాయవాదులు కోర్టులో వాదించారు. మొదట నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌పై జైలులో ఉన్నప్పుడు కస్టడీలోకి తీసుకోకుండా.. ఇప్పుడు మళ్లీ కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేసి కస్టడీకి తీసుకుంటున్నారని పేర్కొన్నారు. వాదనల అనంతరం.. రెగ్యులర్ బెయిల్ పిటిషన్ సంబంధిత కోర్టులో దాఖలు చేసుకోవాలని సూచిస్తూ సుప్రీంకోర్టు రెండు పిటిషన్లను డిస్మిస్ చేసింది.

## లంచ్‌కు ఆహ్వానించిన అమృతా ఫడణవీస్.. జరాంగే ఏమన్నారంటే!



మరాఠా రిజర్వేషన్ల కోసం పోరాడుతున్న మనోజ్ జరాంగే చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష 13వ రోజుకు చేరుకుంది. దీంతో ఆయన ఆరోగ్యం క్షీణిస్తున్నట్లు వైద్య నివేదికలు వెల్లడించాయి. ఈ క్రమంలో నాగ్‌పుర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సతీమణి అమృతా ఫడణవీస్ మీడియాతో మాట్లాడుతూ.. మనోజ్ జరాంగేను సోదరుడిగా భావిస్తున్నానని, ఆయన్ను భోజనానికి తమ ఇంటికి రావాల్సిందిగా ఆహ్వానిస్తున్నానని అన్నారు.

సీఎం సతీమణి ఆహ్వానంపై జరాంగే స్పందించారు. ఆమె నివాసానికి వెళ్లేందుకు ఇది సరైన సమయం కాదన్నారు. ఓ సోదరిగా అభిమానంతో పిలిస్తే మాత్రం.. ఆమె ఆహ్వానాన్ని అంగీకరిస్తానని అన్నారు. అయితే, దీపావళి తర్వాత చేసుకునే 'భావ్‌బీజ్'కు తప్పకుండా వస్తానని అన్నారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా మహారాష్ట్రలో ఈ పండగ చేసుకుంటారు. అయితే, రిజర్వేషన్ కోటా డిమాండ్లను నెరవేర్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు త్వరలో చలో ముంబయి కార్యక్రమాన్ని చేపట్టి తీరతామని జరాంగే స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి సెప్టెంబర్ 12న కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు.

గతేడాది ఆగస్టు 29న ముంబయిలోని ఆజాద్ మైదానంలో జరాంగే ఐదు రోజుల నిరసన కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే. భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో స్పందించిన ప్రభుత్వం.. కొన్ని డిమాండ్లను అంగీకరించడంతో ఉద్యమ నేత ఆందోళనలను విరమించారు. మిగిలిన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ జాల్నా జిల్లాలో గత నెల 29న జరాంగే మరోసారి నిరాహార దీక్ష చేపట్టారు. ఆరోగ్యం క్షీణిస్తుండడంతో పలువురు మంత్రులు ఫోన్‌లో మాట్లాడిన అనంతరం ఐవీ ఫ్లూయిడ్స్ తీసుకునేందుకు ఉద్యమ నేత అంగీకరించారు.

## బ్రిక్స్ సదస్సు: సస్పెన్స్‌కు తెర.. భారత్‌కు జిన్‌పింగ్!

మొదటిపేజీ తరువాయి

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్ పర్యటన విషయంలో కొనసాగుతోన్న సస్పెన్స్‌కు తెరపడింది. బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ఆయన భారత్‌కు రానున్నారు. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వ రంగ మీడియా సంస్థ జిన్హువా వెల్లడించింది.

దేశ రాజధాని దిల్లీలోని భారత్ మండపంలో ఈ నెల 12, 13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరగనుంది . ఈ సదస్సుకు మిగతా సభ్య దేశాల అగ్రనేతలు హాజరవుతుండగా.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ రాకపై మాత్రం తొలి నుంచి సందిగ్ధతే నెలకొన్న సంగతి తెలిసిందే. అయితే, తమకు కూడా ఎలాంటి అధికారిక సమాచారం లేదని అంతకుముందు చైనా విదేశాంగ శాఖ చెప్పడంతో.. అసలు జిన్‌పింగ్ బ్రిక్స్ సదస్సుకు వస్తారా? లేదా? అనే అంశంపై సందిగ్ధత నెలకొంది. చివరకు జిన్‌పింగ్ పర్యటనపై చైనా అధికారిక మీడియా నుంచి ప్రకటన వెలువడడం గమనార్హం.

భారత్-చైనా మధ్య దశాబ్దాలుగా సరిహద్దు విభేదాలు నెలకొన్నాయి. 1962లో యుద్ధం వీటికి నాంది పలికిందని చెప్పొచ్చు. 2020లో గల్వాన్ ఘర్షణతో అవి మరింత తీవ్రరూపం దాల్చాయి. అయితే ఈ మధ్యకాలంలో రెండు దేశాలు కాస్త పట్టువిడుపులు ప్రదర్శిస్తున్నట్లు కనిపిస్తోంది. గతేడాది షాంఘై సహకార సదస్సు (రాజూ)కు ప్రధాని మోదీ హాజరైన సంగతి తెలిసిందే. ఇక ఈ బ్రిక్స్ సదస్సుకు ముందు మోదీ, జిన్‌పింగ్ ప్రత్యేకంగా భేటీ అయి ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## 15వేల మంది పోలీసులు.. 500 సీసీటీవీలు.. బ్రిక్స్ సదస్సుకు భారీ భద్రత

మొదటిపేజీ తరువాయి

నగరంలో భారీగా భద్రతను పెంచారు. దాదాపు 15 వేల మంది పోలీసులను రంగంలోకి దించారు. 200 పారామిలటరీ కంపెనీలను మోహరించారు. విమానాశ్రయాలు, హోటళు ,, భారత్ మండపం సహా కీలక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. నేతలు బస చేసే పలు హోటళ్ల వద్ద ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేశారు.

నగరంలోని కీలక ప్రాంతాల్లో నిఘా కోసం సుమారు 500 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అనుమానాస్పద కదలికలను గుర్తించేందుకు ఆధునిక నిఘా వ్యవస్థలను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. వైమానిక ముప్పును ఎదుర్కొనేందుకు యాంటీ డ్రోన్ వ్యవస్థలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ (శఱ జీఱఅజూఱఅస్త్ర), రష్యా అధ్యక్షుడు పుతిన్ (ఎశ్రీఱసఱఎఱతీ ూబఱఅ) సహా పలువురు దేశాధినేతలు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. వీఐపీ కాన్వాయ్‌ల రాకపోకల కోసం అధికారులు ప్రత్యేక మార్గాలను ఖరారు చేశారు.

## ఆ వీడియోలను నమ్మి మోసపోవద్దు - ప్రియాంక కార్యాలయం హెచ్చరిక

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా పేరుతో సామాజిక మాధ్యమాల్లో నకిలీ వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. కృత్రిమ మేధ సాయంతో ఆమె ఫొటోలు, వాయిస్‌ను ఉపయోగించి ఈ వీడియోలు రూపొందించారు. పలు సంస్థల్లో పెట్టుబడులు పెట్టాలంటూ ప్రియంకా స్వయంగా చెబుతున్నట్లు ఆ వీడియోల్లో ఉంది. ఈ నకిలీ వీడియోలపై ఆమె కార్యాలయం స్పందించింది. వాటిని నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించింది. ఏఐతో రూపొందించిన ఆ వీడియోలు మోసపూరితమైనవని స్పష్టం చేసింది. వాటిలోని లింకులపై క్లిక్ చేయొద్దని, ఎలాంటి పెట్టుబడులు పెట్టొద్దని సూచించింది. ఇలాంటి పోస్టులు కనిపిస్తే వెంటనే ఫిర్యాదు చేసి.. బ్లాక్ చేయాలని కోరింది.

## ఫైళ్లు పెండింగ్‌లో ఉంటే అభివృద్ధి, పాలన పెండింగ్‌లో ఉన్నట్టే: చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి



వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలు, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను క్షేత్రస్థాయిలో అమలుచేయడంలో నాయకత్వమే కీలకమని సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు.గత ప్రభుత్వ మద్యం విధానం అక్రమాలను కలెక్టర్ల సదస్సులో సీఎం లేవనెత్తారు. గత ప్రభుత్వం మార్కెట్‌లోకి తెచ్చిన జే బ్రాండ్ కల్తీ మద్యం వల్ల 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారని, వేలాది మంది ఆరోగ్యం దెబ్బతిందని ఆరోపించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన ఆ కల్తీ మద్యం బ్రాండ్లన్నింటినీ రద్దు చేసి.. ఇప్పుడు పారదర్శకంగా, నాణ్యమైన మద్యం విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టంచేశారు. ప్రతి శాఖలో సంస్కరణలు తీసుకొచ్చామని, ఆర్థిక ప్రగతిని ప్రతి నెలా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. 2022-23ను బేస్ ఇయర్‌గా తీసుకుంటే ప్రస్తుత ధరల ప్రకారం 13.44 శాతం వృద్ధి నమోదైందని, జీఎస్టీ వసూళ్లు గతేడాదితో పోలిస్తే రూ.25,450 కోట్లు పెరిగాయని వెల్లడించారు. వనరులు, టెక్నాలజీ ఉన్నా కొన్ని చోట్ల లోపం ఉందన్న సీఎం.. రియాక్టివ్ గవర్నెన్స్‌కు స్వస్తి చెప్పి ప్రోయాక్టివ్ గవర్నెన్స్ అందించాలని అధికారులను ఆదేశించారు.

### ఫేక్ ప్రచారాలకు వేగంగా కౌంటర్ ఇవ్వాలి..

ఫేక్ ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ కుట్రలకు అధికారులు వేగంగా కౌంటర్ ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. డీఎస్సీ నియామకాల్లో ఎలాంటి తప్పు జరగలేదని, స్పోర్ట్స్ కోటాలో నిబంధనల ప్రకారమే ఉద్యోగాలు ఇచ్చామని తేల్చిచెప్పారు. దుష్ప్రచారాన్ని తిప్పికొట్టిన ఇద్దరు మహిళా అధికారులను అభినందించిన సీఎం.. సరైన సమయంలో స్పందించకపోతే ఆ నష్టం ప్రభుత్వానికే చుట్టుకుంటుందని హెచ్చరించారు. సమీక్షలకే పరిమితం కాకుండా ఫలితాలపై దృష్టి పెట్టాలని, ప్రతి జిల్లాలో 25 టాప్ ప్రాజెక్టులు, ప్రతి నియోజకవర్గంలో 10-15 ప్రాధాన్య ప్రాజెక్టులను గుర్తించి అభివృద్ధి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి రాజీ ఉండదని, సంక్షోభ సమయంలో కలెక్టర్ల నాయకత్వ సామర్థ్యం బయటపడాలని స్పష్టం చేశారు. 2027 నాటికి భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలని, జిల్లాలను గ్రోత్ ఇంజిన్లుగా మార్చి ఆదాయం, సంపద పెంచేలా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం 13.44 శాతంగా ఉన్న వృద్ధిని 15 శాతానికి తీసుకెళ్లే లక్ష్యంతో బెస్ట్ ప్రాక్టీసెస్, కొత్త ఆలోచనలు, వేగవంతమైన పాలనతో ముందుకెళ్లాలని సూచించారు. రివ్యూల నుంచి రిజల్ట్స్ వైపు మారి.. వన్ స్టేట్- వన్ మిషన్- వన్ ఎయిమ్.. అనేదే స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యమని చంద్రబాబు తేల్చి చెప్పారు.

### ఇగోలు పక్కన పెట్టండి..

ఇగోలు పక్కనపెట్టి ప్రజా సేవకులుగా పనిచేద్దామంటూ అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. 27 నెలల్లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టి, సంక్షేమానికి రూ.1.40 లక్షల కోట్లు, అభివృద్ధికి రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. హంద్రీనీవా, వెలిగొండ ఫేజ్-1, పోలవరం ఎడమ కాలువ, భోగాపురం విమానాశ్రయం వంటి కీలక ప్రాజెక్టులు పూర్తి చేశామని, పోలవరాన్ని 2027 మార్చి నాటికి పూర్తి చేస్తామని వెల్లడించారు. నీటి భద్రత, సాగునీటి రంగంలో చేస్తున్న కృషికి 'వాటర్‌మ్యాన్'గా గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్న సీఎం.. రాష్ట్ర ప్రగతి వెనుక మంత్రులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషి ఉందని స్పష్టం చేశారు.

# దళిత బాంధవుడు కేసీఆర్ :

- బీఆర్ఎస్ నాయకుడు చదిరం నాగేశ్వరరావు
- దళిత బంధుతో వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా
- అంబేద్కర్ విగ్రహ నిర్మాణం కేసీఆర్ ఘనతే
- దళితులను రాజకీయ పావులుగా వాడుకోవద్దు
- కేసీఆర్‌పై కాంగ్రెస్ నేతల వైఖరిని ఖండిస్తున్నాం

**ఎల్కతుర్తి సెప్టెంబర్ 10 (జనసముద్రం)**

దళితుల అభ్యున్నతి కోసం దళిత బంధు పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించి, వేలాది కుటుంబాలు ఆర్థికంగా ఎదగడానికి కృషి చేసిన గొప్ప దార్శనికుడు, దళిత



బాంధవుడు మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అని బీఆర్ఎస్ నాయకుడు చదిరం నాగేశ్వరరావు పేర్కొన్నారు.ఎల్కతుర్తిలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌కు 125 అడుగుల భారీ విగ్రహాన్ని నిర్మించడం కేసీఆర్ ఘనత అని అన్నారు. సుమారు రూ.145 కోట్లతో నిర్మించిన ఈ విగ్రహం దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర సచివాలయానికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరు పెట్టడం కేసీఆర్ గొప్పతనానికి నిదర్శనమన్నారు.కేసీఆర్‌పై కాంగ్రెస్ నాయకులు అనుచితంగా వ్యవహరిస్తూ, ఆయన ఇంటి ఎదుట నిరసనల పేరుతో దళితులను ముందుకు తీసుకురావడం హేయమైన చర్య అని నాగేశ్వరరావు విమర్శించారు.దళితులను రాజకీయ ప్రయోజనాల కోసం పావులుగా ఉపయోగించుకోవడం సరికాదన్నారు.అమాయక దళితులను రెచ్చగొట్టి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పురికొల్పితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని కేసీఆర్ ప్రభుత్వం నిర్మించినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి ఆ విగ్రహానికి అధికారికంగా నివాళులు అర్పించలేదని ఆయన విమర్శించారు.దళితుల సంక్షేమం గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని అన్నారు.దళితులను అడ్డుపెట్టుకుని రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం మానుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా దళితులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని నాగేశ్వరరావు హెచ్చరించారు.ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాడి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జూపాక జడ్సన్, ఆరేపల్లి రాజయ్య, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు బొంకూరి కార్తీక్, శనిగరం వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా వినాయక ఉత్సవాలు

**--నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు**

**--కోహెడ ఎస్ఐ పుల్ల అభిలాష్**

**జనసముద్రం న్యూస్ ,కోహెడ, సెప్టెంబర్10: ( కోహెడ ప్రసాదరావు)**

వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించాలని కోహెడ ఎస్ఐ పుల్ల అభిలాష్ సూచించారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం మండలంలోని అన్ని గ్రామాల వినాయక మండపాల నిర్వాహకులతో పోలీసులు సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, మండపాల ఏర్పాటుకు సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్, అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని,



అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

అలాగే శబ్ద కాలుష్యానికి కారణమయ్యే విధంగా డీజేలు, లౌడ్‌స్పీకర్లను అధిక శబ్దంతో వినియోగించరాదని సూచించారు. నిమజ్జనం సందర్భంగా పోలీసుల సూచనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఊరేగింపులు నిర్వహించాలని కోరారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించి శాంతిభద్రతలకు విఘాతం కల్పించకుండా వ్యవహరించాలని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని ఎస్ఐ పుల్ల అభిలాష్ కోరారు.

సమావేశంలో పోలీసు సిబ్బంది, వివిధ గ్రామాలకు లోని వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# భూముల రి సర్వే ను పకడ్బందీగా నిర్వహించాలి

**-జిల్లా కలెక్టర్ కె. హైమావతి**

**జనసముద్రం న్యూస్ కోహెడ సెప్టెంబర్ 10: ( కోహెడ ప్రసాద్ రావు)**

భూముల రీ-సర్వేను మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలనీ, రైతుల సమక్షంలో భూ హద్దులు, కోఆర్డినేట్లను ఖచ్చితంగా నమోదు చెయ్యాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సర్వే అధికారులను ఆదేశించారు.

సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం చెర్ల అంకిరెడ్డి పల్లి గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన భూ భారతి - భూ సర్వే, రీ-సర్వే అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.





ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,భూముల సర్వే 1935 సంవత్సరంలో జరిగింది. మళ్లీ 2026 సంవత్సరంలో భూ సర్వే చేస్తున్నట్లు తెలిపారు. వాస్తవానికి ప్రతి 25 సంవత్సరాలకు ఒకసారి భూముల సర్వే నిర్వహించాల్సి ఉంటుందనీ తెలిపారు.

ప్రభుత్వం ఈ రి-సర్వే కోసం ఆరు ఏడు లక్షలతో అధునాతన పద్ధతులు సర్వే చేయడానికి రోవర్స్ లను కొనుగోలు చేసిందని, దీనివల్ల అత్యంత ఖచ్చితత్వంతో భూములను కొలిచి పగడ్బందీగా హద్దులను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

భూములలో కొనుగోలు చేయడం అమ్మడం మూలంగా సర్వే నంబర్లలో సబ్ నెంబర్లు మారడం, పట్టా ఒకరిది కబ్జాదారులు ఒకరుగా ఉన్నాయని ఇలాంటి సమస్యలకు ఈ రీ-సర్వేలో ఖచ్చితమైన పరిష్కారాన్ని సూచిస్తున్నట్లు, అందుకుగాను రైతులు, అధికారులకు సహకారం అందించాలని తెలిపారు.

రీ-సర్వే ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రీ సర్వే ద్వారా అనేక భూ సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉన్నందున ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని సూచించారు.

రీ సర్వే చేపట్టే ముందు రైతులకు ముందుగానే సమాచారం అందించాలని, రైతుల సమక్షంలోనే భూముల సర్వే ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి భూమి హద్దులను, కోఆర్డినేట్లను ఖచ్చితంగా గుర్తించి నమోదు చేయాలని సూచించారు. రీ సర్వేలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నందున భూముల హద్దులు, కోఆర్డినేట్ల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు.

రీ సర్వే పూర్తయిన అనంతరం ప్రతి రైతుకు వారి భూమికి సంబంధించిన మ్యాప్‌ను ఖచ్చితమైన కోఆర్డినేట్లతో అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా రీ సర్వే ప్రక్రియను నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ అధికారి సుదర్శన్, సర్పంచ్ గాలిపల్లి అనిల్, తహసిల్దార్ సలీం, సర్వే అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

**వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు: కత్తి రవీందర్ రెడ్డి**

**జన సముద్రం న్యూస్ । నాంపల్లి ।నల్లగొండ । సెప్టెంబర్ 10:**

తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ గారి వర్ధంతి సందర్భంగా నాంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కత్తి రవీందర్ రెడ్డి ఆమెకు ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా కత్తి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ భూస్వామ్య దొరల దౌర్జన్యాలకు ఎదురొడ్డి పేదలు రైతులు మహిళల హక్కుల కోసం చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడారని అన్నారు. అన్యాయానికి తలవంచకుండా హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు.చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఎంతో ఆదర్శమని అణగారిన వర్గాల హక్కుల కోసం సామాజిక న్యాయం కోసం ఆమె చూపిన ధైర్యం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని కత్తి రవీందర్ రెడ్డి అన్నారు.



చాకలి ఐలమ్మ త్యాగం చిరస్మరణీయమని ఆమె పోరాట స్ఫూర్తి అజరామరమని ఆమె ఆశయాలు ఎల్లప్పుడూ ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని ఆయన తెలిపారు.చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమెకు హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నట్లు కత్తి రవీందర్ రెడ్డి పేర్కొన్నారు.

# శ్రీకాంత్ కాలనీలో సీసీ రోడ్డు పనులను పరిశీలించిన బిజెపి నేత తల్లోజు ఆచారి

**జన సముద్రం ప్రతినిది పి శ్రీనివాస్.**

ఆమనగల్ మున్సిపాలిటీ శ్రీకాంత్ కాలనీలో బిందు డ్రెస్సెస్ నుంచి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం మీదుగా ఫారెస్ట్ ఆఫీస్ ప్రహరీ గోడ వరకు, అక్కడి నుంచి నేషనల్ హైవే వరకు చేపడుతున్న సీసీ రోడ్డు పనులను బిజెపి నేత, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, వార్డు కౌన్సిలర్ ఎర్రవోలు మహేష్ కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా రోడ్డు పనుల పురోగతి, నాణ్యత, ప్రజలకు కలిగే సౌకర్యాలపై వారు పరిశీలించారు. కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరారు.



ఈ కార్యక్రమంలో బీజేపీ బూత్ అధ్యక్షులు పసుపుల బాబు, కాలనీవాసులు సామల రవి, శేఖర్, రఘుపతి రెడ్డి, పున్న రాజు, కోట సురేందర్, దశరథం, సురేందర్, వంశీకృష్ణ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రుద్రేశ్వర స్వామిని దర్శించుకున్న గోవిందానంద సరస్వతీ స్వామి

- కాకతీయుల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన విద్యారణ్య స్వామి
- వినాయక చవితిని మతసామరస్యంతో నిర్వహించాలి: గోవిందానంద సరస్వతీ స్వామి

**హనుమకొండ సెప్టెంబర్ 10 (జనసముద్రం):**

చతుర్దశి, అమావాస్య పురస్కరించుకొని చారిత్రక రుద్రేశ్వర స్వామి వేయి స్తంభాల దేవాలయాన్ని స్వర్ణ హంపి పంపా క్షేత్ర స్వామి శ్రీశ్రీ గోవిందానంద సరస్వతీ స్వామి గురువారం తెల్లవారుజామున 5 గంటలకు సందర్శించారు.ఆలయానికి చేరుకున్న స్వామివారికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.అనంతరం గర్భాలయంలో రుద్రేశ్వర స్వామివారికి గోవిందానంద సరస్వతీ స్వామి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, మూలమంత్రయుక్తంగా రుద్రాధ్యాయాన్ని నిర్వహించారు. అనంతరం



కాకతీయ సామ్రాజ్యంలో జన్మించి, విజయనగర సామ్రాజ్య స్థాపనలో కీలక పాత్ర పోషించిన శ్రీశ్రీ అనంత విభూషిత జగద్గురు విద్యారణ్య మహాస్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని రుద్రేశ్వర స్వామివారి సన్నిధిలో ఉంచి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ నాట్య మండపంలో భక్తులను ఉద్దేశించి గోవిందానంద సరస్వతీ స్వామి అనుగ్రహ భాషణం చేశారు. కాకతీయ సామ్రాజ్యానికి చరిత్రలో ఎంతో విశిష్టమైన స్థానం ఉందని అన్నారు.కాకతీయులు పరిపాలించిన ప్రాంతాల్లో సాగునీరు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా అనేక చర్యలు చేపట్టడంతో పాటు దాదాపు 300 దేవాలయాలను నిర్మించి ప్రజల్లో ఆధ్యాత్మిక భావనలను పెంపొందించారని పేర్కొన్నారు.కాకతీయుల గడ్డపై జన్మించిన విద్యారణ్య స్వామి విజయనగర సామ్రాజ్య నిర్మాణంలో కీలక పాత్ర పోషించడంతో పాటు శృంగేరి దక్షిణామ్నాయ పీఠం ద్వారా ధార్మిక, ఆధ్యాత్మిక రంగాలకు విశేష సేవలు అందించారని తెలిపారు. అనేక గ్రంథాలను రచించి, ధార్మిక విలువలు, వాటి ఫలితాలను లక్షలాది మందికి వివరించిన మహనీయుడు విద్యారణ్య స్వామి అని కొనియాడారు.కాకతీయుల గడ్డపై గత 20 సంవత్సరాలుగా విద్యారణ్య స్వామి గొప్పతనాన్ని, ఆయన బోధనలను ప్రజలకు వివరిస్తున్నానని గోవిందానంద సరస్వతీ స్వామి తెలిపారు. రాబోయే వినాయక చవితి ఉత్సవాలను మతసామరస్యంతో, కులమతాలకు అతీతంగా ధార్మిక నిష్ఠతో నిర్వహించుకోవాలని సూచించారు. కులాలు, కుల సంఘాలు పటిష్టంగా ఉన్నప్పుడే హిందూ సమాజం మరింత ఐక్యంగా నిలబడుతుందని అన్నారు.ప్రస్తుతం చాతుర్మాస దీక్షను వరంగల్‌లోనే నిర్వహిస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు దేవాలయాలను సందర్శించి, శిథిలావస్థకు చేరుకున్న దేవాలయాలను పరిశీలించి వాటి పునరుద్ధరణకు అవసరమైన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి డి. అనిల్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేందర్ శర్మ, దేవాలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకులను పంపిణి చేసిన చైర్మన్ పత్యనాయక్.

**జన సముద్రం ప్రతినిది పి శ్రీనివాస్.**

అమంగల్ మున్సిపాలిటీ నుండి ఉచిత మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసిన మున్సిపాలిటీ చైర్మన్ పత్య నాయక్.పత్య నాయక్ మాట్లాడుతూ మట్టి విగ్రహాలను పెట్టి పర్యావరణాన్ని కాపాడి కాలుష్యం నివారించాలని చెప్పడం జరిగింది ప్లాస్టర్ ఆఫ్ పారిస్ నుంచి చేసిన విగ్రహాల నుండి రసాయనాలు చెరువులలో కలిసి చెరువులో నివసించే చిన్న చిన్న జీవరాసులు చనిపోయి రసాయనాలు నీళు తాగిన చాపలు తిన్న వారు అనారోగ్యాలు తెచ్చుకుంటారని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమం మున్సిపాలిటీ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి.వైస్ చైర్మన్ గీతా చారి గారు కౌన్సిలర్లు మొక్తాల వెంకటయ్య.



అనూష శ్రీశైలం.మున్సిపాలిటీ సిబ్బంది వివిధ పార్టీల నాయకులు కుమార్ ధోని సురేష్ వెంకటేష్ రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు

# ట్యాంక్ బండపై చాకలి ఐలమ్మ విగ్రహం పెట్టాలి

**జన సముద్రం న్యూస్ సెప్టెంబర్ 11 సూర్యపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గ రిపోర్టర్ అలవాల రవి**

భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటంలో క్రియాశీలక పాత్ర పోషించిన చాకలి ఐలమ్మ 41 వర్ధంతి కార్యక్రమం స్థానిక మెయిన్ రోడ్ లోని పాత బస్టాండ్ సెంటర్ అమరవీరుల స్తూపం వద్ద పట్టణ లాండ్రీషాప్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఇందిరాల నరసయ్య అధ్యక్షతన జరిగినది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూస్వాములు దేశ్ముఖలకు వ్యతిరేకంగా తను పండించిన పంటను రక్షించుకోవడానికి తాను చేసిన పోరాటం ప్రపంచ చరిత్రలో తెలంగాణ సాయుధ పోరాటానికి నాంది పలికిన లక్షల ఎకరాల భూమిని అప్పటి కమ్యూనిస్టుల సహకారంతో వేలాది మందికి భూమిని పంచడానికి కారణమయ్యారని అదేవిధంగా నేటి సమాజంలో మహిళలకు జరుగుతున్న అన్యాయాలు





దౌర్జన్యాలకు మహిళలు భయపడకుండా ఆమెను ఆదర్శంగా తీసుకొని తమను తాము రక్షించుకోవాలని కోరినారు అదే విధంగా చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంకుబండపై ప్రతిష్టించాలని జనగామ జిల్లాకు చాకలి ఐలమ్మ జిల్లాకు నామకరణం చేయాలని పాలకుర్తిలో ఆమె పేరు మీద స్మృతి వనం ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు యనమల రేవంత్ రెడ్డి గారు విన్నవించుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో పట్టణ లాండ్రీ షాప్ యూనియన్ నాయకులు వడ్లనపు శ్రీనివాస్ దుగ్గి బ్రహ్మం రేపాకుల మురళి అలవాలఉపేందర్ ఇందిరాలరాంబాబు అలవాలఅంజి వడ్లనపు నరసింహారావు చిక్కుళ్ తిరుపతయ్య పగిళ్ల నారాయణ చెరుకు రామారావు ఇందిరాలశ్రీనివాస్ రేపాకుల వీరస్వామి యాదగిరి పిన్నపురెడ్డి వెంకటరెడ్డి సురభి కోటయ్య పోతుల చంటి.మీరా ఇందిరాలరవి సిలువేరు శ్రీనివాస్ పాశం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు

# చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించిన వెంకటేష్ గౌడ్

**జనసముద్రం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి సెప్టెంబర్ 11**

కూకట్పల్లి తెలంగాణ సాయుధ పోరాటంతో తనదైన శైలిలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ వారి కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి తెలంగాణ సాయుధ పోరాట కాలంలో చాకలి ఐలమ్మ ప్రదర్శించిన ధైర్య సాహసాలు, చైతన్యం నేటి తరానికీ ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆ కాలంలోనే హక్కుల సాధన కోసం న్యాయస్థానాల్లో చట్టపరమైన పోరాటం



చేసిన ప్రజాస్వామిక వాది ఐలమ్మ అని గుర్తుచేశారు. నాడు ఐలమ్మ ప్రదర్శిందిన స్ఫూర్తి, తెలంగాణ సాధనలోనూ, అనంతర ప్రగతి ప్రస్థానంలోనూ ఇమిడి ఉందని తెలియచేసారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, గోపాల్, పోశెట్టిగౌడ్, మల్లేష్, ఖలీమ్, నరసింహ, సుధ, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్. ఐ. ఆర్, హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి,

**•మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**

జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10, 2026:





ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ – 2026లో మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఓటర్లు అందిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని లక్షెట్టిపేట మండలం లక్ష్మీపూర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి మండల తహసిల్దార్ దిలీప్ కుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్ లతో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో నోటీసుల జారీ, విచారణ ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ అర్హత గల ప్రతి ఒక్క ఓటరు వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రక్రియ నిర్వహించాలని, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్ల సమన్వయంతో ఓటర్లకు అవగాహన కల్పించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిట్టపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి తరగతి గదులు, మధ్యాహ్న భోజన నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. విద్యారంగ అభివృద్ధి దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, ఈ క్రమంలో పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించాలని, మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించి విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని తెలిపారు. ఆసరా పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి మండల పరిషత్ అభివృద్ధి అధికారి లాగిన్ నుండి ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఆహారం నాణ్యతను పరిశీలించారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందిస్తూ నాణ్యమైన విద్యాబోధన అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యంగా.. నిరంతరంగా కొనసాగుతున్న సుంకిరెడ్డి జాబ్ డ్రైవ్

జన సముద్రం ప్రతినిది పి శ్రీనివాస్.



తుక్కుగూడలోని ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీలో జరిగిన జాబ్ డ్రైవ్ ఇంటర్వ్యూ కార్యక్రమంలో ఐక్యత పౌండేషన్ చైర్మన్ ,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి. ముఖ్య అతిథిగా పాల్గొన్నారు

ఈ ఇంటర్వ్యూ కు కల్వకుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా వెల్దండ మండలం నుండి 11 మంది , కల్వకుర్తి మండలం నుండి 7 గురు, ఆమనగల్ మండలం నుండి 16, తలకొండపల్లి మండలం నుండి 01 ఒక్కరు మొత్తం 35 మంది నిరుద్యోగ యువత హాజరయ్యారు.

ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి. మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జాబ్ డ్రైవ్‌లు నిరంతరంగా కొనసాగుతాయన్నారు.

ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతకు అందుబాటులోకి వచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని పిలుపునిచ్చారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. అర్హత, నైపుణ్యాలకు అనుగుణంగా లభించే అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు వీర , మహేష్ ఐక్యత పౌండేషన్ సభ్యులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

# వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం,





**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**

జనసముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10, 2026:

సామాజిక అన్యాయాలు, దోపిడీ, అణచివేతను ఎదురించి చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, వెనుకబడిన తరగతుల శాఖ అధికారి నీరటి రాజేశ్వరి,కుల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు, పట్టుదల నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. వెట్టి చాకిరీ, దోపిడీ, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడి మహిళా చైతన్యానికి, సామాజిక న్యాయానికి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమానత్వం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.


అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణేశ విగ్రహాలను పంపిణీ చేసి మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా జలవనరుల కాలుష్యాన్ని నివారించవచ్చుని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. రసాయనిక రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించి పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలను నిర్వహించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జనసముద్రం వార్త ఎఫెక్ట్.. ఆర్టీఐ బోర్డులో మార్పులు

**•తలకొండపల్లి పీహెచ్‌సీలో తప్పు ఫోన్ నంబర్‌పై సిబ్బంది స్పందన**

తలకొండపల్లి న్యూస్ (సెప్టెంబర్10) జనసముద్రం


జనసముద్రం న్యూస్
ప్రతి అక్షరం జనం కోసం
epaper.janasamudram.com
10 Sep 2026 - Page 5 www.janasamudram.com WhatsApp @ +91 94941 841
ఆర్టీఐ బోర్డులో ఫోన్ నెంబర్ తప్పులు..
తలకొండపల్లి పీహెచ్‌సీలో గందరగోళం
తలకొండపల్లి న్యూస్ (సెప్టెంబర్ 9) జనసముద్రం



తలకొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆర్టీఐ బోర్డులో తప్పుగా నమోదైన అధికారుల ఫోన్ నంబర్లపై 'జనసముద్రం'లో వచ్చిన కథనానికి స్పందన కనిపించింది. ఆర్టీఐ కార్యకర్త శ్రీకాంత్ గుప్తా పరిశీలనలో బోర్డులో అధికారుల సంప్రదింపు వివరాల్లో మార్పులు ఉన్నట్లు గుర్తించిన విషయం తెలిసిందే.

కథనం వెలువడిన అనంతరం పీహెచ్‌సీ సిబ్బంది సంబంధిత ఆర్టీఐ బోర్డులో ఫోన్ నంబర్లను సవరించినట్లు సమాచారం. ముఖ్యంగా డీఎంహెచ్ఓ కార్యాలయానికి సంబంధించిన నంబర్‌లో చివరి అంకెల విషయంలో గతంలో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు.

ఆర్టీఐ చట్టం ప్రకారం పారదర్శకత తప్పనిసరి ప్రజలకు సమాచారాన్ని అందుబాటులో ఉంచడం, ప్రజా సమాచార అధికారుల వివరాలను వెల్లడించడం ప్రభుత్వ శాఖల బాధ్యత. ఆర్టీఐ చట్టం--2005లోని సెక్షన్ 4(1)(బి) కింద ప్రజా సమాచార అధికారుల పేర్లు, హోదాలు, ఇతర వివరాలను వెల్లడించాల్సిన బాధ్యత ఉంది.

అధికారుల సంప్రదింపు వివరాలు తప్పుగా ఉంటే ప్రజలు తమ సమాచార హక్కును వినియోగించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. అందువల్ల బోర్డులో ప్రదర్శించే వివరాలను సరైనవి, తాజావి, ప్రజలకు స్పష్టంగా అందుబాటులో ఉండేలా నిర్వహించాల్సిన అవసరం ఉంది.

తప్పు నంబర్లు ఎలా వచ్చాయి? బాధ్యులెవరు?

బోర్డులో తప్పు ఫోన్ నంబర్లు ఎలా నమోదయ్యాయి? వాటిని ఎవరి ఆదేశాలతో మార్చారు? ప్రస్తుతం సవరించిన వివరాలు అధికారిక రికార్డులతో సరిపోతున్నాయా? అనే అంశాలపై సంబంధిత ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాలని ఆర్టీఐ కార్యకర్త శ్రీకాంత్ గుప్తా కోరుతున్నారు.

జనసముద్రం కథనానికి స్పందించి బోర్డులో మార్పులు చేయడం స్వాగతించదగ్గ విషయమే అయినప్పటికీ.. భవిష్యత్తులో ప్రజలకు తప్పుడు సమాచారం అందకుండా ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోని ఆర్టీఐ బోర్డులను అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# గిరిజన విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కరువు : ఎస్. రజనీకాంత్.

ఏటూరునాగారం, జన సముద్రం న్యూస్, సెప్టెంబర్ 10.



– విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలంటూ ఐటీడీఏ ముట్టడించిన ఎస్ఎఫ్ఐ.

గిరిజన విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం ఐటీడీఏ ఏపీఓను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. రజనీకాంత్ మాట్లాడుతూ, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో కనీస మౌలిక సదుపాయాలు కూడా అందుబాటులో లేకపోవడం దురదృష్టకరమన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ ఛార్జీలను ప్రభుత్వం పెంచి, సకాలంలో నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కొన్ని ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయులు మద్యం సేవించి విధులకు హాజరవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయని, ఇటువంటి ఘటనలపై ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు ఆదర్శంగా ఉండాల్సిన ఉపాధ్యాయులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు.అనేక గిరిజన ఆశ్రమ పాఠశాలల భవనాల్లో తలుపులు, కిటికీలు సక్రమంగా లేకపోవడం, వర్షం వచ్చిన సమయంలో తరగతి గదుల్లోకి నీరు చేరడం వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని పాఠశాల భవనాలకు తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయడంతో పాటు శిథిలావస్థలో ఉన్న భవనాలకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు పట్ల మధు, పైసా గణేష్, ఉమ్మడి జిల్లా నాయకులు అమీర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జాగటి రవితేజ, జిల్లా ఉపాధ్యక్షులు కోగిల బాలు, మండల కార్యదర్శి బట్ట స్వామి, టౌన్ కార్యదర్శి సిద్దు, నాయకులు సాంబశివరావు, గణేష్, సమీర్, దేవేందర్, యస్వంత్ సాయి చరణ్, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తి సహకార సంఘానికి నూతన పాలకవర్గం

**•రైతులకు మెరుగైన సేవలే లక్ష్యం: చైర్మన్ ఇంద్రసేనారెడ్డి**

ఎల్కతుర్తి, సెప్టెంబర్ 10 (జనసముద్రం)





హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి సహకార సంఘం చైర్మన్‌గా ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి నియమితులయ్యారు.ఆయనతో పాటు సహకార సంఘం డైరెక్టర్లుగా శనిగరపు స్వరూప, ఎడవల్లి అశోక్‌రెడ్డి, పుల్లూరి నర్సింహారావు, బొమ్మరబోయిన కుమారస్వామి, చిర్ర రాజయ్య, చల్ల ధనలక్ష్మి, మోడం రాజయ్య, ఇనుగాల సుధాకర్, బక్కయ్య, వీరమల్ల ముకుందరెడ్డి, మద్దె రాములు నియమితులయ్యారు.నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టడంతో ఎల్కతుర్తి సహకార సంఘం పరిధిలోని రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడింది.రైతులకు పంట రుణాలు, ఎరువులు, విత్తనాలు తదితర వ్యవసాయ అవసరాలను సకాలంలో అందుబాటులోకి తీసుకురావడంతో పాటు సహకార సంఘం కార్యకలాపాలను మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత నూతన పాలకవర్గంపై ఉంది.రైతులు ఎదుర్కొంటున్న రుణాలు, వ్యవసాయ పెట్టుబడులు, పంటల సాగుకు సంబంధించిన సమస్యలను గుర్తించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చైర్మన్, డైరెక్టర్లు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.సహకార సంఘం ద్వారా రైతులకు పారదర్శకంగా సేవలు అందించి, సంఘం అభివృద్ధికి నూతన పాలకవర్గం కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు.రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తూ సహకార సంఘం సేవలను గ్రామీణ స్థాయిలో మరింత విస్తరించాలని, ప్రతి రైతుకు అవసరమైన సహకారం అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు సూచించారు. నూతన పాలకవర్గం బాధ్యతలు స్వీకరించడంతో ఎల్కతుర్తి సహకార సంఘం కార్యకలాపాలు మరింత చురుకుగా సాగి రైతులకు ప్రయోజనం చేకూరుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

# ఎం.ఎల్.ఎస్. పాయింట్ల వద్ద నిల్వల పంపిణీని సకాలంలో పూర్తి చేయాలి,

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు,**

జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10, 2026:



జిల్లాలోని అన్ని ఎం.ఎల్.ఎస్. పాయింట్ల వద్ద నిలువల పంపిణీ సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, ఎ.సి.ఎస్.ఓ. తో కలిసి ఇన్‌చార్జీలు, డి.ఈ.ఓ.లు, స్టేజ్--1, స్టేజ్--2 గుత్తేదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్(రెవెన్యూ) వి. రాములు, మాట్లాడుతూ ఎం.ఎల్.ఎస్. పాయింట్ల వద్ద ఉన్న నిల్వల పంపిణీ ప్రక్రియను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని సంబంధిత ఇన్‌చార్జీలను ఆదేశించారు. స్టాక్ తరలింపులో ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు. స్టేజ్--1, స్టేజ్--2 గుత్తేదారులు అవసరానికి అనుగుణంగా తగినన్ని వాహనాలను ముందస్తుగా ఏర్పాటు చేసుకుని, అందుబాటులో ఉన్న నిల్వలను సకాలంలో తరలించాలని ఆదేశించారు. నిల్వల తరలింపు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, గుత్తేదారులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల కోసం గ్రామదేవతలకు పూజలు

**•మహబూబాబాద్ జిల్లా**

జన సముద్రం న్యూస్ రిపోర్టర్ గంగారం మండలం సెప్టెంబర్ 10.



గంగారం మండల కేంద్రంలో గురువారం రైతులు వానలు కురవాలని పంటలు సమృద్ధిగా పండాలని గ్రామ దేవతలకు పూజలు. పాలాభిషేకాలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఎల్నీనో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి రైతులు వేసుకున్న మొక్కజొన్న ప్రత్తి వరి కంది వంటి పంటలు ఎండిపోతున్నాయి. ఏజెన్సీ మండలమైన గంగారంలో ఏడాది తొలకరిలో కొంతవరకు వర్షాలు కురవడంతో రైతులు ఆశాభావంతో పంటలు వేసుకున్నారు. ఆ తర్వాత అడపాదడపా వర్షాలకు పంటలు ఏపుగా పెరిగి రైతుల్లో ఆశలు పెరిగాయి. గత వారం పది రోజులుగా ఒక్క చినుకు కూడా పడకపోవడంతో ఏపుగా పెరిగిన మొక్కజొన్న పంటకు రెండవ దఫా యూరియా వేస్తే తలపువ్వు పీసులు వేసే సమయంలో వర్షం పూర్తిగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో రైతులు తాము నమ్మిన దేవుళ్లను కొలుస్తూ పూజలు చేస్తున్నారు. గంగారం మండల కేంద్రంలో గంగారం రైతులు స్థానికంగా ఉన్న గ్రామ దేవతలైన బొడ్రాయి ముత్యాలమ్మ ఆంజనేయస్వామి శ్రీ శ్రీ గంగమ్మ తల్లి ఆలయంలో బిందెలతో నీళ్లు పోసి పాలాభిషేకాలు చేసి కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు.

# హెచ్ ఐ వి/ఎయిడ్స్ వ్యాధిపై అవగాహనలో యువతదే కీలక పాత్ర

**రామాపురం జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 10**

అన్నమయ్య జిల్లా రామాపురం మండలం లో శ్రీ వెంకటేశ్వర హై స్కూల్ నందు ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఏపిశాక్స్) సలహా ఆదేశాల మేరకు పి.సి.ఎస్.ఎస్.--టి.ఐ. ఎన్‌జీవో ఆధ్వర్యంలో విద్యార్థినులకు హెచ్ ఐ వి/ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ ఐ వి/ ఎయిడ్స్ ఎలా వ్యాపిస్తుంది, ఎలా వ్యాపించదు, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలను వివరించారు.



పి సి ఎస్ ఎస్ ప్రాజెక్ట్ ఓఆర్ డబ్ల్యూ విజయలక్ష్మి,నరసమ్మ మాట్లాడుతూ హెచ్ ఐ వి/ఎయిడ్స్ తో పాటు లైంగికంగా సంక్రమించే అంటువ్యాధులు (ఎస్ టి ఐ), వాటి నివారణ, కండోమ్ ఉపయోగం, హెచ్ ఐ వి (ప్రివెన్షన్ అండ్ కంట్రోల్) యాక్ట్, 2017, ఏఆర్ టి మందులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి సేవలు మరియు టోల్‌ఫ్రీ నంబర్ 1097 తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

హెచ్ ఐ వి పై సరైన అవగాహన కలిగి, అపోహలు మరియు వివక్షను దూరం చేయడంలో యువత ముందుండాలని అన్నారు. అలాగే హెచ్ ఐ వి నివారణ కార్యక్రమాల్లో 95-95-95 లక్ష్యాల ప్రాధాన్యతను వివరించారు. హెచ్ ఐ వి తో జీవిస్తున్న వారిలో 95 శాతం మందికి తమ హెచ్ ఐ వి స్థితి గురించి అవగాహన కల్పించడం, హెచ్ ఐ వి పాజిటివ్‌గా గుర్తించబడిన వారిలో 95 శాతం మందికి చికిత్స అందించడం, చికిత్స పొందుతున్న వారిలో 95 శాతం మందిలో వైరల్ లోడ్ నియంత్రణ సాధించే దిశగా ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పి సి ఎస్ ఎస్ ప్రాజెక్ట్ ఓఆర్డబ్ల్యూ విజయలక్ష్మి, నరసమ్మ పిఈ నాగవేణి పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఆరోగ్య కార్యకర్తల నెలసరి సమావేశం

**లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 10**

అన్నమయ్య జిల్లా. లక్కిరెడ్డిపల్లి. రామాపురం మండలాల. ఆరోగ్య కార్యకర్తల సమావేశం గురువారం

ఆరోగ్య కార్యకర్తలకు సి. హెచ్. సి లక్కిరెడ్డిపల్లి నందు నెలసరి సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సమావేశంలో ముఖ్యంగా మగ ఆరోగ్య కార్యకర్తలకు ఈ క్రింది విధముగా తెలియజేయడం జరిగినది. ప్రతిరోజు మీ మీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తలు ఆడవారి చే విక్టరీ కంట్రోల్ రైస్ చేయడం ప్రతి శుక్రవారం ఫ్రైడే చేయడం సభ్ యూనిట్ పరిధి లోపాలనూ ఈ క్రింద విషయాలన్నీ తెలియపరచడం జరిగినది. మీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సెక్రటేరియట్ లో ఏ ఇండికేటర్ తక్కువ ఉందో ఏరోజుకారోజు యాప్ పరిశీలించి ఆడ ఆరోగ్య కార్యకర్తలకు తెలియజేయాలని కోరడమైనది, లక్కిరెడ్డి పల్లి సభ్యూనిట్ పరిధిలోని ఉదాహరణకు రామాపురం



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నీ వెంకట్ రెడ్డి గారి పల్లి,పప్పి రెడ్డి గారి పల్లి, బై రెడ్డి గారి పల్లి, గోపగుడిపల్లి, నూలువిడి -ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూలువీడు కోనంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దప్పేపల్లి దిన్నపాడు పందిళ్ళపల్లి గాలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రము లో ఎగువగొట్టి వీడు గాలివీడు 01, 02.03 దేవలంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మద్దిరేవుల, ఖా= పల్లి లక్కిరెడ్డిపల్లి 02 పై సచివాలయాలన్నీ వారం వారశీ చాలా వెనకబడి ఉన్నాయని మగ ఆరోగ్య కార్యకర్తలకు తెలియజేస్తూ వీరి ద్వారా నూటికి నూరు శాతం చేయించాలని తెలియజేయడం జరిగినది.

# కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే పీహెచ్డీ సాధించిన దీపా బానోత్..

**ఉప్పల్ సెప్టెంబర్ 9 జనసముద్రం దినపత్రిక: -**

ఉప్పల్ నియోజకవర్గంలోని కాప్రా ఈసీఐఎల్ కు చెందిన ఉస్మానియా యూనివర్సిటీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ పరిశోధక విద్యార్థిని దీపా బానోత్ బిజినెస్ మేనేజ్‌మెంట్ పీహెచ్‌డీ పట్టా సాధించారు. ఇద్దరు పిల్లల తల్లిగా, గృహిణిగా కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసి డాక్టరేట్ పొందడం అభినందనీయం. డా.దీపా బానోత్ "తెలంగాణలో ఎంపిక చేసిన ప్రభుత్వ మరియు ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగుల సంతృప్తిపై తులనాత్మక అధ్యయనం (తెలంగాణ రాష్ట్రంలోని ఎంపిక చేసిన పబ్లిక్ మరియు ప్రైవేట్ విశ్వవిద్యాలయాలలో ఉద్యోగుల సంతృప్తిపై తులనాత్మక అధ్యయనం) అనే అంశంపై పరిశోధన జరిగింది. ఉన్నత విద్యా సంస్థల్లో ఉద్యోగుల




సంతృప్తికి తగిన సూచనలను కూడా ప్రతిపాదించారు. ఈ పరిశోధనను డా. వి .సమున్నత పర్యవేక్షణలో పూర్తి చేశారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీరాములు, డీన్ ప్రొఫెసర్ జహంగీర్, డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ విద్యాసాగర్ రావు, అధ్యాపకులు, పరిశోధకులు మరియు సిబ్బంది డా. దీపా బానోత్‌ను అభినందించారు. ఇద్దరు పిల్లల తల్లిగా కుటుంబ బాధ్యతలను (పెద్ద కుమారుడు ఎంబీబీఎస్ మరియు చిన్న కుమారుడు ఇంజనీరింగ్) చదువుతున్న సమయంలోనూ కుటుంబ భాధ్యతలు చూసుకుంటూ పీహెచ్‌డీ సాధించడం ద్వారా దీపా బానోత్ తన సంకల్పం, పట్టుదల, కృషితో కుటుంబ బాధ్యతలు ఉన్నా ఉన్నత లక్ష్యాలను సాధించినట్లు నిరూపించారు. ఈ సందర్భంగా డా. దీపా బానోత్ తన విజయానికి సహకరించిన తన భర్త శ్రీ రవి తేజకు, కుటుంబ సభ్యులకు మరియు తన పరిశోధన పర్యవేక్షకురాలు డా.వి. సమున్నతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పరిశోధన సమయంలో వారు అందించిన నిరంతర ప్రోత్సాహం, సహకారం తన పీహెచ్డీ ప్రయాణంలో కీలకమని ఆమె పేర్కొన్నారు.


ఆమె సాధించిన ఈ విజయం కుటుంబ బాధ్యతలతో పాటు ఉన్నత విద్యను కొనసాగించాలని ఆకాంక్షించే మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

# ఘడియ గౌరారంలో 70వ మండల స్థాయి ఎస్ జి ఎఫ్ క్రీడలు

**చింతపల్లి, సెప్టెంబర్ 10 (జనసముద్రం న్యూస్ ప్రతినిధి):**

చింతపల్లి మండల స్థాయి 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జి ఎఫ్) పాఠశాలల క్రీడా పోటీలు ఈ నెల 15న జడ్పీహెచ్ఎస్ ఘడియ గౌరారం పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి ఎన్. అంజయ్య తెలిపారు.మండలంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ప్రైవేట్ తదితర అన్ని యాజమాన్యాల పాఠశాలల అర్హులైన విద్యార్థులు ఉదయం 9 గంటలలోపు అవసరమైన వయస్సు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. అండర్--14, అండర్--17 బాలురు, బాలికల విభాగాల్లో పోటీలు నిర్వహించబడతాయని తెలిపారు.

కబడ్డీ విభాగంలో అండర్--14 బాలికలకు 48 కిలోలు, బాలురకు 51 కిలోలు, అండర్--17 బాలురు, బాలికలకు 55 కిలోల వరకు మాత్రమే బరువు అర్హత ఉంటుందని పేర్కొన్నారు. క్రీడాకారుల ప్రతిభ, వయస్సు, బరువు, ఎస్ జి ఫ్ నిబంధనల ఆధారంగా మండల జట్టును ఎంపిక చేసి తదుపరి స్థాయి పోటీలకు పంపనున్నట్లు




తెలిపారు.ఇంటర్మీడియట్ విద్యార్థులు మండల టోర్నమెంట్‌లో పాల్గొనరని, అయితే సాయంత్రం జరిగే ప్రాబబుల్స్ ఎంపిక ద్వారా మండల జట్టుకు అవకాశం ఉంటుందని ఎంఈఓ స్పష్టం చేశారు. క్రీడలను విజయవంతం చేసేందుకు అన్ని పాఠశాలలప్రధానోపాధ్యాయులు, పి డి/పిఈటీలు, ఉపాధ్యాయులు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు.

# ఫోర్త్ సిటీ భూముల కేటాయింపుపై సమగ్ర విచారణ జరపాలి

- **ప్రజా ఆస్తుల విషయంలో పారదర్శకత అవసరం: బీఆర్ఎస్ నేతలు**

**కందుకూర్ న్యూస్ (సెప్టెంబర్ 10)జనసముద్రం**

ఫోర్త్ సిటీలో భూముల కేటాయింపుపై వస్తున్న ఆరోపణలు, అనుమానాల నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి, ఇతర బీఆర్ఎస్ నాయకులు గురువారం సంబంధిత భూముల వద్దకు చేరుకుని పరిశీలించారు.

ప్రభుత్వ భూములు, ప్రజా ఆస్తుల కేటాయింపులో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పూర్తి పారదర్శకత పాటించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డికి



చెందినదిగా పేర్కొంటున్న టెసెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ కంపెనీకి ఫోర్త్ సిటీలో భూమి కేటాయింపుపై వస్తున్న ఆరోపణలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భూమి కేటాయింపు ప్రక్రియ ఎలా జరిగింది? ఏ నిబంధనల ప్రకారం కేటాయించారు? కేటాయింపుతో ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రజలకు కలిగే ప్రయోజనం ఏమిటి? అనే అంశాలపై పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని కోరారు.

ప్రజా ఆస్తులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసమే వినియోగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై




ఉందన్నారు. అందువల్ల ఫోర్త్ సిటీ భూముల కేటాయింపుపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సెక్రటరీ సామ మహేందర్ రెడ్డి, కందుకూరు మండల అధ్యక్షుడు మన్నె జయేందర్, అనెగౌని దామోదర్ గౌడ్, సామ ప్రకాష్ రెడ్డి, డ్యారంగుల జంగయ్య, రావిచెట్టు శ్రీనివాస్, ఎం. లక్ష్మణ్, పోల్దాస్ నరేందర్ తదితర బీఆర్ఎస్ నాయకులు

# వినాయక చవితికి పటిష్ట భద్రత





- **నిమజ్జనానికి అనువైన ప్రాంతాల పరిశీలన**
- **డీజేలకు అనుమతి లేదు.. పోలీసుల సూచనలు పాటించాలి**

**ఒంటిమిట్ట జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 10:**

వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు వొంటిమిట్ట ఎస్ఐ వి. శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో వినాయక చవితి పండుగ ఏర్పాట్లపై ప్రజలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపన, పూజా కార్యక్రమాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వినాయక నిమజ్జనానికి అనువైన ప్రాంతాలను పరిశీలిస్తున్నామని, పోలీసు అధికారులు సూచించిన ప్రదేశాల్లోనే నిమజ్జనం నిర్వహించాలని తెలిపారు.

జిల్లా ఎస్పీ ఎస్. నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. డీజేలకు అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పండుగ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.

అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం డయల్--100, 112 నంబర్లను సంప్రదించాలని ఎస్ఐ సూచించారు. ప్రజల భద్రతకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

# అనుమతులు లేకుండా లేఅవుట్లు వేస్తే డెమాలిష్ చేస్తాం

- **నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి హెచ్చరిక**
- **ఎల్ఆర్ఎస్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి.**
- **ఎల్ఆర్ఎస్ కోసం చేసిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి**
- **అనుమతులు లేని లేఔట్లలో ఎవ్వరూ ప్లాట్స్ కొనొద్దు**
- **అక్రమ లేఔట్లపై ఉక్కు పాదం**

**నెల్లూరు, సెప్టెంబర్ 10, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**



నుడా అనుమతులు లేకుండా లేఅవుట్లు వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అధికారులను ఆదేశించారు. నుడా కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశమై లేఅవుట్లు, ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులు, అనుమతులు లేని లేఅవుట్లపై సమీక్ష నిర్వహించారు. నుడా పరిధిలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన లేఅవుట్లను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన లేఅవుట్లపై చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైతే వాటిని డెమాలిష్ చేయాలని ఆదేశించారు. అక్రమ లేఅవుట్ల విషయంలో ఎలాంటి ఉపేక్ష ఉండకూడదని స్పష్టం చేశారు. ఎల్ఆర్ఎస్‌పై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని చైర్మన్ సూచించారు. ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వాటిని నిబంధనల మేరకు పరిశీలించి, అర్హత ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నుడా అప్రూవల్ లేని లేఅవుట్లలో ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేయవద్దని కోటంరెడ్డి సూచించారు. ప్లాట్ కొనుగోలు చేసే ముందు లేఅవుట్‌కు నుడా అనుమతి ఉందో లేదో నిర్ధారించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనుమతులు లేని లేఅవుట్లను గుర్తించి చర్యలు తీసుకోవడంతో పాటు,ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు చైర్మన్ స్పష్టం చేశారు.

# పవర్ బోర్‌కు త్వరితగతిన మరమ్మతులు చేయించాలని వినతి

**మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్**

**మల్కాజిగిరి, జనసముద్రం న్యూస్, సెప్టెంబర్ 09:**

ఓల్డ్ మల్కాజిగిరిలోని ఎ ా న ు వ ా న్ వ్యాయామశాల వద్ద గత వారం రోజులుగా పనిచేయని పవర్ బోర్‌ను వెంటనే మరమ్మతులు చేసి కాలనీవాసులకు నీటి సౌకర్యం అందుబాటులోకి తీసుకురావాలని మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ కోరారు.ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు బోర్ సమస్యను వాటర్ వర్క్స్ డీజీఎం బ్రహ్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, అధికారులు



మరమ్మతు పనులు చేపట్టారు. అయితే బోర్ మోటార్ మధ్యలో ఇరుక్కుపోవడంతో మరమ్మతు పనులకు అంతరాయం ఏర్పడింది.ఈ నేపథ్యంలో జీఎం సునీల్‌ను కలిసి సమస్యను త్వరితగతిన పరిష్కరించి బోర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని జగదీష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. దీనిపై జీఎం సునీల్ సానుకూలంగా స్పందిస్తూ, అతి త్వరలో మరమ్మతులు పూర్తి చేసి కాలనీవాసులకు నీటి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు బాబయ్య గౌడ్, పండు యాదవ్ పాల్గొన్నారు.

# రీ-సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి,

- **మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు,**

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10, 2026:**

రీ -సర్వే ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని తాండూర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రీ-సర్వే ప్రక్రియ పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రీ-సర్వేకు సంబంధించిన కో-రిలేషన్ రిజిస్టర్ నిర్వహణ, వివరాల నమోదు తదితర



అంశాలను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. మండలంలోని రాంపూర్ గ్రామానికి సంబంధించి రికార్డుల హక్కుల నవీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఆర్.ఓ.ఆర్. లో వివరాల నవీకరణ చేపట్టేటప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన ప్రామాణిక విధానాల ప్రకారం అన్ని చర్యలను నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. రీ-సర్వే ప్రక్రియలో భాగంగా భూ రికార్డుల పరిశీలన, పాత రికార్డులతో నూతన రికార్డుల అనుసంధానం, కో-రిలేషన్ రిజిస్టర్ నిర్వహణ తదితర అంశాలలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజుల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని విడనాడి...

- కార్పొరేషన్ ఏర్పాటు చేసి, నామినేట్ పోస్టుల్లో, స్థానిక సంస్థ ఎన్నికల్లో తగిన ప్రాథమిక కల్పించాలి...
- ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్ రావు ముదిరాజ్ డిమాండ్






**జనసముద్రంన్యూస్, సెప్టెంబర్ 10;**
కూటమి ప్రభుత్వ ఏర్పడి రెండున్నర సంవత్సరాలు దాటుతున్నా ముదిరాజుల సంక్షేమాన్ని, రాజకీయ అభివృద్ధిని పట్టించుకోవటం లేదని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు, వైఎస్ఆర్సిపి ముదిరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్ రావు ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 25 లక్షల పైగా ముదిరాజులు ఉన్నారని వారి ఆర్థిక అభివృద్ధికి కూటమి, చంద్రబాబు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకున్నట్టు దాఖలా లేవని, మాకంటే తక్కువ జనాభా కలిగిన సోదర కులాలకు కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లను ఏర్పాటు చేసిన ప్రభుత్వం మాపై మాత్రం చిన్నచూపు చూట్టం భావ్యం కాదన్నారు. జనాభా తమాషా ప్రకారం కల్పించాల్సిన బాధ్యతా మరిచిందన్నారు. బీసీల ప్రభుత్వం చెప్పుకునే టిడిపి ముదిరాజులపై చిన్న చూపు చూడటం వెమపై ఆయన ప్రశ్నించారు.

వైయస్సార్ కుటుంబమే ముదిరాజుల ఆర్థిక అభివృద్ధికి దోహదపడింది,...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయినట్టు నుండి రెండుసార్లు అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ముదిరాజులకు ఎటువంటి రాజకీయ పదవులు అందించలేదని, వారి సంక్షేమం కోసం ఎటువంటి చర్యలు కూడా తీసుకోలేదని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ముదిరాజులను బిసి డి నుండి ఏ లోకి మార్చడానికి సహాయపడ్డాడని, అలాగే వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మొట్ట మొదటిసారిగా ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లను ఏర్పాటు చేసి వారి యొక్క ఆర్థిక అభివృద్ధికి దోహదపడ్డాడరని ఆయన గుర్తు చేశారు. అసెంబ్లీలో టిడిపి ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు ముదిరాజుల కార్పొరేషన్, ఆర్థిక అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడటం సంతోషకరమన్నారు . ఈ సమావేశంలో ముదిరాజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొర్నే నారాయణ ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి లు వల్లేబోయిన రాజు ముదిరాజ్, డాక్టర్ ఎన్ మరేష్ ముదిరాజ్, బోనాల శేషగిరిరావు ముదిరాజ్, రాష్ట్ర ముదిరాజ్ మహాసభ కోశాధికారి బాలబోయిన పాపారావు ముదిరాజ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పాము వెంకట రవికుమార్ ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సంఘన బోయిన సాంబశివరావు ముదిరాజ్, రాష్ట్ర యూత్ అధ్యక్షులు సిరివెళ్ల జయేష్ ముదిరాజ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు తూము ఝాన్సీ రాణి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిసిన డేగల సైదరాజు



**జనసముద్రంన్యూస్, సెప్టెంబర్ 10;**
ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి మరియు టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ను అమరావతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డేగల సైదరాజు గురువారం మర్యాదపూర్వకంగా కలవటం జరిగింది. ఈ సందర్భంగా వారి ఇరువురి మధ్య రాష్ట్ర అభివృద్ధి, యువత ఉపాధి, స్థానిక సంస్థల ఎన్నికలు మరియు ప్రజా సమస్యల పై చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

## అక్రమ అరెస్ట్ కు సంఘీభావం తెలిపిన మాచర్ల టీడీపీ నాయకులు, కార్యకర్తలు




**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, సెప్టెంబర్ 10;**
మాచర్ల పట్టణంలోని నెహ్రూ నగర్ లోని టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ అయి 3వ ఏడాది అయ్యింది. కావున టిడిపి సీనియర్ నాయకులు, క్లస్టర్, యూనిట్ మరియు బూత్ ఇన్చార్జీలు, టిడిపి మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు, అభిమానులు అందరూ పాల్గొని 53 దీపాలు వెలిగించి సంఘీభావం తెలిపారని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వడ్డెర సంక్షేమ కార్పోరేషన్ డైరెక్టర్
మరియు మాచర్ల టిడిపి అధ్యక్షులు కొమెర దుర్గారావు తెలిపారు.

## శ్రీ శివ శంకర మహామాయ దేవాలయంలో ప్రత్యేక పూజలు అన్నప్రసాద వివరణ...




**ఉప్పల్ సెప్టెంబర్ 9 జనసముద్రం దినపత్రిక: -**
ఉప్పల్ పరిధిలోని శ్రీ శివ శంకర మహామాయి దేవాలయం, ఉప్పల్ లోఅధిక జేష్ఠ మాస అమావాస్య సందర్భంగా అమ్మవారి విశేష పూజలు, అన్న ప్రసాద వితరణ జరిగింది,ఈ కార్యక్రమం లో దేవాలయ సభ్యులు ఉప్పోజి బలవంత చారి,బిక్షపతి,శ్రీనివాస్,చోల్లేటి శ్రీనివాస్,శ్రీధర చారి పాలేర్ల గోపి,శామీర్ పేట హనుమంత్ రెడ్డి,మామిళ్ళ మల్లేష్,కృష్ణరెడ్డి,గొంది ప్రశాంత్ రెడ్డి, జగన్,నర్సింహా రెడ్డి,అభిరామ్,గుమిడెల్లి కృష్ణ, గురువయ్య గౌడ్,నవీన్,ముదుగొండ రావి,,ప్రవీణ్ రెడ్డి,నర్సింహా రావు,కొత్తకొండ రమేష్,మహేష్, జగన్,బిక్షపతి,రామ్ ప్రకాష్,గోపి చారి,పసుపు నేటి రమేష్,వెంకటయ్య,కుమార్,భాస్కర్ చారి,నవీన్ గౌడ్,రాజు,సందీప్,మహేష్ కుమార్,ప్రశాంత్ కుమార్,పవన్ కుమార్,భవాని శంకర్,సంతోష్ కుమార్,లక్ష్మణ్,సంతోష్ కుమార్,బంటి,శ్రీను,శ్రీనివాస్ గౌడ్,గణేష్ గౌడ్,యది గౌడ్,వెంకటేష్,తదితర భక్తులు పాల్గొన్నారు.

## అసెంబ్లీకి వెళ్తున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యేల పై లైంగిక వేధింపుల కేసు పెట్టారు

తలసాని కృష్ణ యాదవ్ మాజీ మంత్రి




ప్రముఖ పత్రికలో బిఆర్ఎస్ నేతల పై లైంగిక వేధింపుల కేసు అంటూ ప్రచురితమైంది.1994 లోనే నేను , ౹ా రమణ ఎమ్మెల్యేలుగా ఉన్నాము.అసెంబ్లీకి వెళ్తున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యేల పై లైంగిక వేధింపుల కేసు పెట్టారన్నారు రెండు తెలుగు రాష్ట్రాల్లో 6 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వాళ్ళల్లో నాతో పాటు నలుగురు ఐదుగురే ఉంటారు.మొదటి సారి చూస్తున్న అసెంబ్లీకి వెళ్తున్న వారి పై ఇలాంటి కేసులు పెట్టడం....!తాతలు , ముత్తాతలు సంపాదించిన భూములను 22–ూ జాబితాలో పెట్టారు.వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన వైఫల్యం చెందింది.సెప్టెంబర్ 07 తారీఖు రోజు అసెంబ్లీ గేటు బయట అంతమంది పోలీసులను పెట్టాల్సిన అవసరం ఏముంది....?తోపులాటలో బిఆర్ఎస్ శాసన సభ్యులకు దెబ్బలు తగిలాయి.మహిళ శాసన సభ్యులైనసబితా ఇంద్రారెడ్డి సునీతా లక్ష్మారెడ్డి గొంతు , చీర పట్టుకొని లాగారు.అసెంబ్లీ బయట స్పీకర్ పరిధి కానే కాదు... తాతా మధు అనని మాటలను అసెంబ్లీ బయట జరిగిన విషయాన్ని భారతదేశ దేశ రాజకీయాల్లో రెడ్డి స్పీకర్, బీసీ స్పీకర్, దళిత స్పీకర్ అన్నట్లు చరిత్రలోనే లేదు.గడ్డం ప్రసాద్ కుమార్ అంటే బిఆర్ఎస్ పార్టీ గౌరవం.దళిత స్పీకర్ గా గడ్డం ప్రసాద్ కుమార్ ను బిఆర్ఎస్ చూడలేదు.గడ్డం ప్రసాద్ కుమార్ దళితుడని ఈ రాష్ట్ర ప్రజలకు సగం మందికి తెలియదు.ముఖ్యమంత్రి , మంత్రులు పదే పదే దళితుడు దళితుడు అనబట్టే గడ్డం ప్రసాద్ కుమార్ దళితుడని తెలిసింది.దళితుడైన గడ్డం ప్రసాద్ కుమార్ వెంటనే ముఖ్యమంత్రిని చేయాలని డిమాండ్ చేస్తున్నాము.దళితుల పై ప్రేమ చూపిస్తున్న రేవంత్ రెడ్డి గడ్డం ప్రసాద్ కుమార్ ను ముఖ్యమంత్రిని చేసి నిరూపించుకోవాలి.ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం దగ్గర దళితులు డప్పు కొడితే శుద్ధి చేశామని ముఖ్యమంత్రి అంటున్నాడు.తూముకుంట నర్సారెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ రెడ్డి దళితుడా....!శాసన సభలో ఫేక్ అకౌంట్ పేరును ముఖ్యమంత్రి ప్రస్తావనకు తెచ్చారు.సంధ్యా రావు అనే ఫేక్ అకౌంట్ నడిపించేదే కాంగ్రెస్ సోషల్ మీడియా.125 అడుగుల డా బిఆర్ అంబేద్కర్ విగ్రహం పెట్టాలని ఎవరు కోరలేదు.ట్యాంక్ బండ్ పక్కన 125 అడుగుల డా బిఆర్ అంబేద్కర్ విగ్రహం కేసీఆర్ పెట్టారు.భారతదేశంలో ఎక్కడ లేని విధంగా సచివాలయంకు డా" బిఆర్ అంబేద్కర్ పేరు పెట్టాము.తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కేసీఆర్ కోరుకున్నారు.కేసీఆర్ చనిపోవాలని కాంగ్రెస్ శాసన సభ్యుడు అంటే శాసన సభలో చర్చ పెట్టరా.....!కేసీఆర్ చనిపోవాలని మాట్లాడిన కాంగ్రెస్ శాసన సభ్యుడు సస్పెండ్ చేయాలి.అసెంబ్లీకి వెళ్తున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యేల పై లైంగిక వేధింపుల కేసు పెడితే .... మేము అసెంబ్లీ కి వచ్చేది ఎలా.....?తెలంగాణ పుట్టిన దగ్గర నుంచి గ్రామాల్లో వరుసలు పెట్టుకొని పిలుచుకునే సంస్కారం తెలంగాణలో ఉంటుంది.కాంగ్రెస్ నేతల బజారు భాషతో తెలంగాణ సంస్కారాన్ని నాశనం చేస్తున్నారు.బిఆర్ఎస్ పార్టీలో లేని శాసన సభ్యుడుని ఫ్యానల్ స్పీకర్ గా ఎన్నుకున్నారు.ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్ ను అనని మాటలను స్పీకర్ కు ఆపాదించారు.స్పీకర్ ను తాతా మధు అన్నట్టు నిరూపిస్తే బిఆర్ఎస్ శాసన సభ్యులు మొత్తం క్షమాపణ చెప్పేందుకు సిద్ధం..... మాకు ఎటువంటి భేషజాలు లేవు.బిఆర్ఎస్ మహిళలను ముందు పెట్టీ తోసేశామని ...కాంగ్రెస్ నేతలు దారుణంగా మాట్లాడుతున్నారు.ముషీరాబాద్ బ్రిడ్జి, ౧×మీా, సైఫాబాద్ స్టీల్ బ్రిడ్జి బిఆర్ఎస్ హయంలోనే మొత్తం పనులు పూర్తి అయ్యాయి.పూర్తి అయిన వాటికి రిబ్బన్ కట్ చేస్తూ రేవంత్ రెడ్డి అకౌంట్ లో వేసుకుంటున్నాడు.కాంగ్రెస్ ఇంట్లో పంచాయతీ బిఆర్ఎస్ పై రుద్దుతున్నారు.చీ= ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి నేను రాజకీయాల్లో ఉన్నాను.ఇలాంటి రాజకీయాలు నేను ఎన్నడు చూడలేదు.గడ్డం ప్రసాద్ కుమార్ ను ముఖ్యమంత్రి చేయాలని రాహుల్ గాంధీని వేడుకుంటున్న.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చెయ్యాల్సిందే.హామీలు అమలు చేసేదాక బిఆర్ఎస్ పోరాటం చేస్తూనే ఉంటుంది.ఈ సమావేశంలో బిఆర్ఎస్ విప్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, దీజ కమిషన్ మాజీ సభ్యుడు కిషోర్ గౌడ్, కురవ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## జాతీయ వేదికపై జలమండలి ఉత్తమ విధానాల ప్రజెంటేషన్

**పట్టణ నీటి భద్రతలో హైదరాబాద్ అనుభవాలను వివరించిన జేఎండీ మయాంక్ మిట్టల్**

పట్టణ నీటి భద్రత, మురుగునీటి నిర్వహణలో హైదరాబాద్ జలమండలి అమలు చేస్తున్న ఉత్తమ విధానాలు, పరివర్తనాత్మక కార్యక్రమాలను జలమండలి జేఎండీ మయాంక్ మిట్టల్ జాతీయ వేదికపై వివరించారు.సెప్టెంబర్ 9న ముంబైలోని బాంబే ప్రదర్శన కేంద్రంలో ప్రారంభమైన ఐఎఫ్ఏటీ ఇండియా--2026 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. “ఒకే నీరు -- ఒకే నగరం -- ఒకే భవిష్యత్తు: వికసిత్ భారత్--2047 కోసం పట్టణ నీటి నిర్వహణకు పునరాలోచన” అనే ఇతివృత్తంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఇందులో భాగంగా జరిగిన “మెగా సిటీస్ వాటర్ అలయన్స్: పట్టణ నీటి భద్రతలో భారతీయ నాయకత్వం” ప్రత్యేక సమావేశంలో జలమండలి ఉత్తమ విధానాలు, వినూత్న కార్యక్రమాలపై మయాంక్ మిట్టల్ వివరణాత్మక సమర్పణ చేశారు.హైదరాబాద్ నగరంలో నీటి భద్రత, తాగునీటి సరఫరా బలోపేతం, మురుగునీటి శుద్ధి, శుద్ధి చేసిన నీటి పునర్వినియోగం, భూగర్భ జలాలు--వర్షపు నీటి సంరక్షణ, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల విస్తరణ కోసం జలమండలి చేపడుతున్న చర్యలను

# నిజం గెలిచింది!

**అక్రమ అరెస్ట్ కు కొవ్వొత్తులతో సంఘీభావం తెలిపిన పట్లవీడు కూటమి నాయకులు, కార్యకర్తలు**

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం, సెప్టెంబర్ 10;**




మూడేళ్ల క్రితం ఇదే రోజు... ప్రజల కోసం ఐదు దశాబ్దాలు నిస్వార్థంగా పనిచేసిన నాయకుడిని అక్రమ కేసులతో అరెస్ట్ చేసి, 53 రోజుల పాటు జైలు గోడల మధ్య నిర్బంధించిన చీకటి రోజు.

**అధికారం అణచివేయగలదు...**
కానీ ప్రజల అభిమానాన్ని అణచివేయలేం. తప్పుడు కేసులతో ఇబ్బందులకు గురిచేసినా... ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది తెలుగు ప్రజల ఆశీస్సులతో కడిగిన ముత్యంలా చంద్రబాబు జైలు నుంచి బయటకు వచ్చారు. ఇది కేవలం ఒక నాయకుడి విజయం కాదు... నిజం, న్యాయం, ప్రజాస్వామ్యం సాధించిన విజయం. ప్రజా బలమే తెలుగుదేశం పార్టీకి...

**చంద్రబాబు కి శ్రీరామరక్ష!**
నిజం గెలిచింది... న్యాయం గెలిచింది... ప్రజాస్వామ్యం గెలిచింది. ఇందుకు సంఘీభావంగా మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలంలోని పట్లవీడు గ్రామ కూటమి నాయకులు,కార్యకర్తలు కొవ్వొత్తులు వెలిగించి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు బత్తుల అంకమ్మరావు, వెల్దుర్తి మండలం క్లస్టర్ ఇంఛార్జ్ రొండి ఆంజనేయులు ఎంపి, ఎల్ఎల్ బి పలువురు గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అరెస్టులతో ప్రజా సమస్యలపై పోరాటాన్ని ఆపలేరు:- గుర్రం సురేష్




**జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 10: డిండి :-**
బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఆందోళన కార్యక్రమం నేపథ్యంలో నల్లగొండ జిల్లా గుండ్లపల్లి డిండి మండల కేంద్రంలో బిఆర్ఎస్వి మండలం అధ్యక్షులు గుర్రం సురేష్ ను గురువారం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఆందోళన కార్యక్రమంలో పాల్గొనకుండా అడ్డుకునే ఉద్దేశంతో పోలీసులు ముందస్తు అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికీ ఉందని తెలిపారు.ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టులతో అణచివేయడం సరికాదని,ప్రజా ఉద్యమాలను పోలీసుల ద్వారా అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.ఎన్ని నిర్బంధాలు,అరెస్టులు చేసినా ప్రజా సమస్యలపై తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

## జనసముద్రం న్యూస్ కీసర సర్కిల్ గోధుమ కుంట గ్రామంలో ఈరోజు నిర్వహించి S I R ఓటర్ లిస్ట్ సంబంధించిన



డాక్యుమెంటేషన్ పత్రాలు నోటీసులకు బదులు ఇవ్వడానికి సబ్మిట్ చేయడానికి చాలామంది రావడం జరిగింది కావున చిన్న పిల్లల్ని ఎత్తుకొని మరియు వృద్ధులు చాలా గంటల తరబడి వెయిట్ చేయవలసి వస్తుంది కాబట్టి కొద్దిగా ఆ డాక్యుమెంటేషన్ కౌంటర్లు పెంచినచో బాగుంటుందని గ్రామప్రజలు కోరుకుంటున్నారు ఇట్టి విషయంలో కీసర మండల తాసిల్దార్ గారు కౌంటర్లు పెంచే ఆలోచన చేయగలరని మరియు మరి ఒక రోజు ఈ గ్రామంలో ఏర్పాటు చేయవలసిందిగా గోమకుంట గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు

## బుగ్గవాగు రిజర్వాయర్ ను పరిశీలించిన ఎమ్మెల్యే జూలకంటి



బుగ్గవాగు రిజర్వాయర్ ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి.

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, దుర్గి మండలం, సెప్టెంబర్ 10;**
మాచర్ల నియోజకవర్గం దుర్గి మండలంలోని శ్యామరాజుపురం గ్రామంలో జరిగిన రైతులకు నూతన పట్టాదారు పాసుపుస్తకాలను అందజేయడానికి వెళ్తూ మార్గమధ్యలో ఉన్న బుగ్గవాగు రిజర్వాయర్ దగ్గర ఆగిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నీటిని ఏవిధంగా దిగువకు విడుదల చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం బుగ్గవాగు రిజర్వాయర్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వృద్ధులకు, అనాధలకు అన్నదాన కార్యక్రమం



**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, సెప్టెంబర్ 10;**
అల్లం రామిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వర్గీయ అల్లం శివారెడ్డి జ్ఞాపకార్థం, మాచర్ల పట్టణంలోని స్వామి వివేకానంద సేవాశ్రమంలో అనాథలు, వృద్ధులకు అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు. ట్రస్ట్ ఫౌండర్ అల్లం కోటిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 204ఏ రీజినల్ ఛైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు ముఖ్యఅతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చెన్నకేశవరావు మాట్లాడుతూ.. స్వర్గీయ అల్లం రామిరెడ్డి పేరున చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి, సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న అల్లం కోటిరెడ్డి సేవలను అభినందించారు. సమాజంలోని నిరుపేదలు, అనాథలు, వృద్ధులకుఅండగానిలుస్తూసేవాకార్యక్రమాలునిర్వహించడ ం అభినందనీయమన్నారు. సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ మరింత మందికి స్ఫూర్తిగా నిలవాలనిఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి ఛైర్మన్, ఫౌండర్ మెట్టు గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవి సేవా అన్నప్రసాద కమిటీ పర్యవేక్షణలో గర్భిణీ స్త్రీలకు ఉచిత అన్న ప్రసాదం





**జనసముద్రంన్యూస్, కారంపూడి, పల్నాడు జిల్లా, సెప్టెంబర్ 10;**
పల్నాడు జిల్లా కారంపూడి పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల నందు ప్రతినెలా 9వ తేదీన గర్భిణీ స్త్రీల కొరకు పి.ఎం.ఎస్.ఎం.ఏ కార్యక్రమానికి వచ్చే గర్భిణీ స్త్రీలు, ఆశా వర్కర్లు, పేషెంట్లు, ఏ ఎన్ ఎం ఎస్ లు, ఎం ఎల్ హెచ్ పి ఎస్ లు, స్టాఫ్ కు 200 మందికి అన్న ప్రసాద భోజనాల పంపిణీకి సహకరించిన దాతలు సముద్రాల ప్రకాష్(యుఎస్ఏ) ధర్మపత్ని రేణుక కూతురు శృతి, కుమారుడు శ్రీకర్, సహకారంతో అన్న ప్రసాద భోజనాలు అందించడం జరిగింది. వెలుగురు శేషారావు ధర్మపత్ని భారతి పర్యవేక్షణలో జరిగిన ఈ నారాయణ సేవా కార్యక్రమంలో అన్న ప్రసాద కమిటీ ఫౌండర్ భవిరిశెట్టి రామారావు, మహిళా కమిటీ సభ్యులు చిన్ని లక్ష్మి, చిన్ని అనంతలక్ష్మి, పల్లా పద్మ, సూరే ధనలక్ష్మి, గుండా మహేశ్వరి, సముద్రాల పద్మ, బచ్చు నాగమణి, ఊటుకూరి వాణి, వైద్యశాల డాక్టర్లు డాక్టర్ లక్ష్మీ మౌనిక, డాక్టర్ రమ్య, రిటైర్డ్ సి హెచ్ ఓ కే. మల్లయ్య, సూపర్వైజర్ మస్తాన్ వలి , హెల్త్ అసిస్టెంట్ ఎం.లాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## దేవళమ్మ చెరువుకు మహర్దశ..!





- శాశ్వత తాగునీటి పరిష్కారమే ధ్యేయం..!
- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

**జన సముద్రం న్యూస్ పల్నాడు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10**
పట్టణ పరిధిలోని దేవళమ్మ చెరువుకు మహర్దశ పట్టనున్నది. దాదాపు రూ. 6 కోట్ల 60 లక్షలతో చెరువు పునరుద్దరణకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మూడు దశాబ్ధాల కాలంలో కనివిని ఎరుగని రీతిలో చెరువులోని పూడికతీత పనులు, చెరువు కట్టల బలోపేతం, గ్రీనరి, వాకింగ్ ట్రాక్ వంటి పనులకు టెండర్లు దక్కించుకున్న మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ సంస్థ త్వరలో పనులు ప్రారంభించనున్నది. ఈ నేపథ్యంలో గురువారం దేవళమ్మ చెరువుకు తాగునీరు తీసుకొచ్చేందుకు అవసరమై డీపీఆర్ ను సిద్ధం చేయాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశించారు. లింగాపురం ప్రభుత్వ లే-అవుట్ వద్ద ఉన్న నాగార్జున సాగర్ కుడి కాలువనుపరిశీలించారు. అక్కడినుంచిగ్రావిటీద్వారాతాగునీ రునుచెరువుకుమరలించేందుకుతగిన సాధ్యాసాధ్యాలను పర్యవేక్షించి, అధికారులకు తగు సూచనలు చేశారు. వివిధ శాఖల ద్వారా రావాల్సిన అనుమతులపై సమీక్షించారు. సమగ్ర తాగునీటి సరఫరాపై ప్రతిష్టాత్మక చర్యలు తీసుకుని, పనులు ప్రారంభించారని ఎమ్మెల్యే జూలకంటి ఆధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, డీఈ రాములు నాయక్, ఏఈ రాఘవ, టీడీపీ నాయకులు కజ్జం సైదయ్య, కొమెర దుర్గారావు, మందలపు రామకృష్ణ, గట్ల కోటిరెడ్డి, సుభానీ తదితరులు ఉన్నారు.

## గవర్నమెంట్ ఆఫ్ ఇండియా- న్యూఢిల్లీ శిక్షణ కు జీవనజ్యోతి ఆనంద నిలయం ఆశ్రమం




**రైల్వే కోడూరు జన సముద్రం న్యూస్ సెప్టెంబర్ 10**
ఆంధ్రప్రదేశ్ తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం పెద్దఓరంపాడు గ్రామపంచాయతీ పాపిరెడ్డి పల్లె సమీపంలోని జీవనజ్యోతి ఆనంద నిలయం ఆశ్రమం సేవలకు అరుదైన గౌరవం దక్కింది

వృద్ధుల సేవలు, బాల బాలికల సేవలు దివ్యాంగులు సేవలు మరియు ట్రాంజెండర్ సేవలు గుర్తించిన సర్వోదయ రీజినల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ ఆంధ్ర ప్రదేశ్ మినిస్టర్ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా- న్యూ ఢిల్లీ వారు వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్లీ , ఏబుల్డ్ ట్రాంజెండర్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ డిపార్ట్మెంట్ అందిస్తున్న ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఫంక్షన్ రీస్, సీనియర్ సిటిజన్ హోమ్స్ ప్రత్యేక శిక్షణ కొరకు జీవనజ్యోతి ఆనంద నిలయం ఆశ్రమం ప్రపంచస్థాయిలో గుర్తింపు కలిగి ఉన్న మినిస్ట్రీస్ ఆఫ్ జస్టిస్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా- న్యూఢిల్లీ వారి ద్వారా జీవనజ్యోతి ఆనంద నిలయం ఆశ్రమం చైర్మన్ పాణ్యం సుబ్రమణ్యం స్వామి ప్రత్యేక శిక్షణ పొందుతున్న కార్యక్రమం ఎంతో గౌరవప్రదమైనది అని మేధావులు ప్రత్యేకంగా పత్రికా రంగానికి తెలిపారు .

## ఇరిగేషన్ అధికారులతో కామినేని





**జన సముద్రం న్యూస్ ప్రతినిధి వి, కె, ఆర్ ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం సెప్టెంబర్10:**
ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్ కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ కైకలూరు మండలం వింజరం లాకుల వద్ద ఇరిగేషన్ ఇఇ తో కలిసి నియోజకవర్గంలోని డి,సి చైర్మన్లు, నీటిసంఘం అధ్యక్షులు,ఇరిగేషన్,డ్రైనేజి,ఆర్,డబ్ల్యూ,యస్,శాఖల అధికారులు మరియు రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతు సూపర్ ఎల్నినో ప్రభావం వల్ల నీటి కరువుతో మంచినీటి చెరువుల్లో నీటి నిల్వలు తగ్గడం వలన ప్రజలు పడుతున్న ఇబ్బందులు, వర్షాలు లేక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని అని తెలిపారు.
అక్కడినుంచే ఇరిగేషన్ ఇంజనీర్ ఇన్ చీఫ్ నరసింహ మూర్తి కి, అడ్వైసర్ వెంకటేశ్వర రావు తో సమస్య పై మాట్లాడారు. వారు స్పందించి, మీటింగ్ జరుగుతుండగానే అక్కడున్న ఇఇ కి పై అధికారుల నుండి ఫోన్ రావడం జరిగింది. నీటి ప్రవాహాలు పెంచుతామని హామీ ఇచ్చారు.
వదిలిన నీటిని అన్ని డిపార్ట్మెంట్ల సహకారంతో మంచినీటిని నింపాలని ఇఇ ని కోరారు. సూపర్ ఎల్నినో వల్ల ఈ ఏడాది సాధారణం కంటే చాలా తక్కువ వర్షాలు పడ్డాయని అందువలన చెరువులు, కాలువలలో నీటి మట్టాలు తగ్గుతున్నాయని కాలువలకు నీటిని వదిలేటప్పుడు 'వారబందీ'
(రొటేషన్ పద్ధతి) ని కచ్చితంగా అమలు చేసి పంచాయతీ, ఇరిగేషన్, ఆర్, డబ్లుయు,యస్, పోలీస్, రెవెన్యూ డిపార్ట్మెంట్ల సహకారంతో నీటిని సరఫరా చెయ్యాలని కోరారు.
గ్రామాలలో మంచినీటి చెరువులు నిండిన అనంతరం వరిపొలాల రైతులు నీరు తోడుకోవచ్చుని తెలియజేశారు.
ఈ క్లిష్ట సమయంలో ఇరిగేషన్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ నీటి వృధాను అరికడుతూ అన్ని పంచాయతీ చెరువులకు నీరు అందేలా మీరు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనమండలి సభ్యులు కమ్మిలి విఠల్ రావు గారు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఒనుకొండలో జనసేన టీం పర్యటన

### గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్న అనంతగిరి జనసేన పార్టీ మండల అధ్యక్షులు చిట్టం మురళి






**అనంతగిరి జనసముద్రం న్యూస్ సెప్టెంబర్:10**
అనంతగిరి మండలం లంగుపర్తి పంచాయతీ పరిధిలోని ఒనుకొండ గ్రామంలో అనంతగిరి జనసేన పార్టీ బృందం పర్యటించింది. జనసేన పార్టీ అనంతగిరి మండల అధ్యక్షులు చిట్టం మురళి మండల నాయకులు కలిసి గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ప్రతి వీధిలో పర్యటిస్తూ ప్రజలతో మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రధానంగా మంచినీటి సమస్య తమను తీవ్రంగా ఇబ్బంది పెడుతోందని జనసేన పార్టీ మండల అధ్యక్షులు చిట్టం మురళి దృష్టికి తీసుకువచ్చారు. వేసవి కాలంలోనే కాకుండా ఇతర సమయాల్లో కూడా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని, సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. గ్రామస్తుల సమస్యపై వెంటనే స్పందించిన చిట్టం మురళి, సంబంధిత ఆర్ డబ్ల్యు ఎస్ ఏఈ కి ఫోన్ చేసి గ్రామంలో నెలకొన్న మంచినీటి సమస్యను వివరించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా తక్షణమే చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని అధికారిని కోరారు. ప్రజల సమస్యలను అధికారులు కూడా ప్రాధాన్యతగా తీసుకుని త్వరగా పరిష్కరించాలని సూచించారు.
అదేవిధంగా గ్రామానికి రోడ్డు సౌకర్యం కూడా ఎంతో అవసరమని గ్రామస్తులు మురళికి తెలిపారు. రహదారి సౌకర్యం సక్రమంగా లేకపోవడం వల్ల నిత్యజీవితంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అత్యవసర పరిస్థితుల్లో కూడా సమస్యలు వస్తున్నాయని వివరించారు. గ్రామ అభివృద్ధికి రోడ్డు నిర్మాణం ఎంతో అవసరమని వారు కోరారు.
మరో ముఖ్యమైన సమస్యగా గ్రామస్తులు గడ్డ అడ్డుగా ఉండటం వల్ల బ్రిడ్జి అవసరం ఉందని తెలిపారు. వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, గ్రామ ప్రజలు సురక్షితంగా రాకపోకలు సాగించేందుకు అక్కడ బ్రిడ్జి మంజూరు చేయాలని చిట్టం మురళిని కోరారు. గ్రామస్తుల సమస్యలను ఓపికగా విన్న చిట్టం మురళి మాట్లాడుతూ, ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, అవసరమైన సమస్యలను జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి దృష్టికి కూడా తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడమే జనసేన పార్టీ నాయకుల లక్ష్యమని, గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తామని మురళి పేర్కొన్నారు. మంచినీరు, రోడ్లు, బ్రిడ్జిల వంటి మౌలిక వసతులు ప్రజల ప్రాథమిక అవసరాలని, వీటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ పర్యటనలో జనసేన పార్టీ మండల నాయకులు పాంగి లక్ష్మణ్, సాగర మధు, ఎగువ శోభ పంచాయతీ కార్యదర్శి కొర్ర మోహన్ చంద్రతో పాటు గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడిన జనసేన మండల అధ్యక్షులు చిట్టం మురళికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎన్టీఆర్ స్ఫూర్తితో రైతులకు సంక్షేమాలు..!

- ఆస్తుల హరించేందుకు జగన్ కుట్రలు
- కూటమి ప్రభుత్వ సంస్కరణలతో రైతేరాజు..!
- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి





**జన సముద్రం న్యూస్ పల్నాడు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10**
టీడీపీ వ్యవస్థాపకులు అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితోనే ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు సంక్షేమాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పునరుద్ఘాటించారు. గురువారం మండల పరిధిలో పర్యటించిన ఆయన.., ముందుగా మైనింగ్ గ్రాంట్ నిధులు ద్వారా రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన క్రీస్తు లూధరన్ చర్చి కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు అనంతరం గ్రామంలో పర్యటించి, స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మండల రెవిన్యూ అధికారులు ఏర్పాటు చేసిన మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో పాల్గొని, 857 మంది రైతులకు రాజముద్రతో కూడిన పట్టదారు పాసుపుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో రైతుల ఆస్తులను హరించేందుకు జగన్ రెడ్డి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. పట్టదారు పాసుపుస్తకాలపై, పొలం గట్ల రాళ్లపై జగన్ ఫోటో ముద్రించుకుని రాష్ట్రంలోని రైతుల ఆస్తులను తాకట్టుపెట్టాలని చూశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ల్యాండ్ రీసర్వే ద్వారా రైతుల ఆస్తులను పరిరక్షించేలా పాసుపుస్తకాలపైరాజముద్రనుముద్రించిపట్టాదారుపాసు పుస్తకాలనుఅందిస్తున్నామని చెప్పారు. అలానే జగన్ రెడ్డి ఎత్తివేసిన 33 రైతు సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్దరించి, రైతును రాజును చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యకక్రమంలో తహశీల్దార్ వరకుమార్,సీనియర్అసిస్టెంట్శ్రీనివాస్,కూటమిపార్టీల నాయకులుయాగంటిమల్లికార్జునరావు,లింగాబ్రహ్మయ్య, జానికిరామయ్య, శంకర్, రమేష్, నాగేశ్వరరావు, పులిహరి తదితరులు పాల్గొన్నారు.

## నరసాపురంలో పర్యటించిన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ప్రజలతో మమేకమైన ఎమ్మెల్యే








**నరసాపురం సెప్టెంబర్ 10 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్**
నరసాపురం పట్టణంలోని 31వ వార్డులో గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా చినమామిడిపల్లిలోని నాగారమ్మ గుడి వెనుక ప్రాంతంలో డ్రైనేజీ సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అక్కడ 250మీటర్ల సి సి రోడ్డు, డ్రైన్ మరియు కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనులను వెంటనే ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేయిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న ముగ్గురు లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి మొత్తం రూ.1,89,155 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను వారి ఇళ్ల వద్దే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ, అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అవసరమైన సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలోనే తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు.

## గ్రామాభివృద్ధికి జైకొట్టి.. వైసీపీకి గుడ్ బై చెప్పి..!
## -వైసీపీని వీడి టీడీపీలోకి వలసల పర్వం..




**జన సముద్రం న్యూస్ పల్నాడు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10**
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి, పంచుతున్న సంక్షేమాన్ని చూసి, టీడీపీకి జై కొట్టి.., వైసీపీ గుడ్ బై చెప్తున్నారు జగన్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు. గురువారం మండల పరిధిలోని శ్యామరాజుపురం గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సమక్షంలో వైసీపీకి చెందిన 10 కుటుంబాలు ఆ పార్టీని వీడి, టీడీపీలోకి చేరారు. పార్టీలోకి వస్తున్న వారికి, పార్టీ కండువా కప్పిన జూలకంటి, టీడీపీలోకి సాదరంగ ఆహ్వానించారు. దార్శనికులైన ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమాన్ని చూసి టీడీపీలోకి వలసలు పెరిగాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట టీడీపీ సీనియర్ నాయకులు యాగంటి మల్లికార్జునరావు, లింగా బ్రహ్మయ్య, జానికిరామయ్య, యాగంటి నరేష్, సింగు నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## కలకత్తా- చెన్నై జాతీయ రహదారిపై ట్రావెల్ బస్సు దగ్ధం, 19 మంది ప్రయాణికులు సేఫ్



**నెల్లూరు, సెప్టెంబర్ 10, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**
చెన్నై- కలకత్తా జాతీయ రహదారి ఓజిలి మండల పరిధిలోని రాచపాలెం చెరువు వద్ద గురువారం తెల్లవారుజామున ట్రావెల్ బస్సులో మంటలు చెలరేగి దద్దమైన సంఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాద సంఘటనలు డ్రైవర్, సహా19 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. కామాక్షి ప్రైవేట్ ట్రావెల్ ఏ ఆర్01 ఎస్ 6404 నెంబరు గల బస్సు రేపల్లె నుండి, బెంగళూరుకు 19 మంది ప్రయాణికులతో వెళు తోంది, రమారమి తెల్లవారుజాము 2 గంటల పైన ఈ ప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా అకస్మాత్తుగా బస్సులో మంటలు చెలరేగడంతో డ్రైవర్ బస్సును ఆపి అందులో ప్రయాణికులను అప్రమత్తం చేసి క్రిందికి దింపారు. వారిని మరో ట్రావెల్ బస్సులో గమ్యస్థానాలకు పంపించారు. డ్రైవర్ అప్రమత్తంతో భారీ ప్రాణ నష్టం జరగకుండా అందరూ ప్రాణాలతో బయటపడ్డారు. బస్సు మాత్రం మంటల్లో ఖాళీ బూడిదైంది. ఓజిలి పిఎస్ ఎస్ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ముత్యాలమ్మ సాక్షిగా ఊరుకునే ప్రసక్తే లేదు..!




- గ్రామోత్సవాల్లో అలజడులకు శిక్షలు తప్పవు..!
- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి ఆగ్రహం

**జనసముద్రం న్యూస్ పల్నాడు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10**
గ్రామాభివృద్ధి.., ప్రజా ఉన్నతికి నిర్వహించే ఉత్సవాల్లో నీచ రాజకీయాలతో అలజడులు సృష్టించాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని జమ్మలమడల గ్రామంలో కొలువుదీరిన గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ తల్లి జాతరలో పాల్గొన్న జూలకంటి, ముందుగా గర్భాలయంలో కొలువుదీరినఅమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన శిడిమాను ఉత్సవంలో పాల్గొని, ప్రత్యేక పూజలతో మాను గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ.. పోలీసు శాఖ అనేక ఆంక్షలు నడుమ తిరునాళ్లకు అనుమతులు వచ్చాయని, రాజకీయ పబ్బం కోసం పండుగ వాతావరణాన్ని పాడు చెయ్యోద్దని సూచించారు. పోలీసులకు సహకరిస్తూ.., ప్రశాంత వాతావరణంలో తిరునాళ్లను జరుపుకోవాలని సూచించారు. గ్రామానికి అపఖ్యాతి తెచ్చేలా ఎవరు ప్రవర్తించిన సహించేది లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లో వోల్టేజ్ కు ఇక చెక్ ట్రాన్స్ఫార్మర్ ప్రారంభించిన ఎమ్మెల్యే నాయకర్




**నరసాపురం సెప్టెంబర్ 10 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్**
నరసాపురం మండలంలోని తూర్పుతాళ్ళు గ్రామంలో ఆక్వా రంగానికి మరింత మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు ఏర్పాటు చేసిన 8 ఎం వి ఏ పవర్ ట్రాన్స్ఫార్మర్‌ను గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ఆక్వా రంగం నరసాపురం నియోజకవర్గ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ఆక్వా రైతులకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ అందుబాటులో ఉండటం ఎంతో ముఖ్యమని, ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని తూర్పుతాళ్ళులో 8 ఎం వి ఏ సామర్థ్యం కలిగిన పవర్ ట్రాన్స్ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్త పవర్ ట్రాన్స్ఫార్మర్ అందుబాటులోకి రావడంతో తూర్పుతాళ్ళు గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లోని ఆక్వా రైతులకు విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందని, లో-వోల్టేజ్, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు వంటి సమస్యలు తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. దీని ద్వారా ఆక్వా చెరువులకు అవసరమైన మోటార్ల నిర్వహణ సులభతరమై, రైతులకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు.

ఆక్వా రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. నరసాపురం నియోజకవర్గంలో ఆక్వా రంగ అభివృద్ధికి అవసరమైన విద్యుత్, రహదారులు, డ్రైనేజీ, ఇతర మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి, ముఖ్యంగా ఆక్వా రంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆక్వా రైతులకు ఉత్పత్తి వ్యయం తగ్గేలా, వారి పంటకు మెరుగైన మార్కెట్ అవకాశాలు లభించేలా అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు మరియు నియోజకవర్గ జనసేన టిడిపి బిజెపి నాయకులు జనసైనికులు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పదవి పోయాక అనిల్‌కు మైండ్ పనిచేయడం లేదు.. అక్రమాల చిట్టా అంతా మా దగ్గరుంది
## రూ.50 వేల కోట్ల వ్యాపారాలున్న వీపీఆర్‌కు దందాలు చేయాల్సిన ఖర్మ పట్టలేదు:
## కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**నెల్లూరు, సెప్టెంబర్ 10, జన సముద్రం జిల్లా ప్రతినిధి.**
2019లో రెండు చేతులూ నెత్తిన పెట్టుకుని వచ్చి కాళ్లు పట్టుకున్న రోజులు అనిల్ మరచిపోయాడా?
ఇంటెలిజెన్స్, విజిలెన్స్ విచారణలో ప్రసన్నకుమార్ రెడ్డి అక్రమ మైనింగ్ జాతకాలు బయటపడటం ఖాయంసీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ పిలుపుతోనే వైసీపీ నేతల కట్టుకథల బండారాన్ని బయటపెడుతున్నాం
ఉపాధి, అభివృద్ధిని చూసి ఓర్వలేకనే సోషల్ మీడియాలో నీచమైన అసత్య ప్రచారాలు
వైసీపీ నేతలు నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌లు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి (వీపీఆర్), కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులపై చేస్తున్న కక్షపూరిత ఆరోపణలకు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తీవ్రస్థాయిలో కౌంటర్ ఇచ్చారు. గురువారం నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ప్రశాంతి రెడ్డి, ఆధారాలతో సహా వైసీపీ నేతల మోసాలను, అక్రమాలను నిలదీశారు. అమరావతిలో ఇటీవల జరిగిన టీడీపీ లీడర్‌షిప్ కాన్క్లేవ్‌లో సీఎం నారా చంద్రబాబు నాయుడు , మంత్రి నారా లోకేష్ ఇచ్చిన సూచనల మేరకే, ప్రజలకు వాస్తవాలను వివరించేందుకు మీడియా ముందుకు వచ్చానని స్పష్టం చేశారు.
అనిల్ దయనీయమైన గతం ఇదే
అనిల్ కుమార్ యాదవ్ విశ్వాసఘాతుక రాజకీయాలకు చిరునామా అని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ధ్వజమెత్తారు. 2019 ఎన్నికల ఫలితాల రోజు సాయంత్రం అనిల్ తన చిన్నాన్న రూప్ కుమార్‌ను వెంటబెట్టుకుని వచ్చి, మీరే శివపార్వతులు,ఎన్నికల్లో ఓడిపోతే రోడ్డున పడతాను, నా దగ్గర రూపాయి లేదు' అని వేడుకున్న



విషయాన్ని గుర్తుచేశారు. ఆ నాడు దయతో ఆదుకున్న వీపీఆర్ పైనే ఈ రోజు నోరు పారేసుకోవడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. మంత్రి పదవి ఊడిపోయాక అనిల్‌కు మైండ్ పనిచేయడం లేదని, 2024 ఎన్నికల్లో నెల్లూరు ప్రజలు తన్ని తరిమేస్తే నర్సారావుపేటకు, అక్కడ కూడా తరిమేస్తే చెన్నైకి పారిపోయాడని ఎద్దేవా చేశారు.
వీపీఆర్‌కు దందాల అవసరం లేదు.మైనింగ్ దొంగలు వైసీపీ నేతలే
వీపీఆర్ కి దేశవ్యాప్తంగా రూ. 50 వేల కోట్ల విలువైన అధికారిక మైనింగ్ కాంట్రాక్టులు ఉన్నాయని, ఇంకా 35 ఏళ్లకు సరిపడా వ్యాపారాలు చేతుల్లో ఉన్నాయని చెప్పారు. సంపాదించిన తర్వాత ప్రజలకు సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చిన వీపీఆర్‌కు ఎలాంటి ఇల్లీగల్ దందాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. నెల్లూరు యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతోనే 2024లో క్వార్ట్జ్ పరిశ్రమ దిశగా అడుగులు వేశామని, అయితే రాజకీయ రాద్ధాంతం ఇష్టం లేక 2025లోనే అధికారికంగా ఆ భాగస్వామ్యం నుంచి బయటకు వచ్చేశామని వివరించారు. ఈ రోజుకూ క్వార్ట్జ్ మైనింగ్ పేరిట అనిల్ యాదవ్ ఎవరెవరి దగ్గర ఎంతెంత దోచుకున్నాడో 76 మంది బాధితుల జాబితా తన వద్ద ఉందన్నారు. ఇంకా ఎంతో మంది నష్టపోయారని చెప్పారు.
మైనారిటీలకు అండగా నిలిచింది మేమే
మైనారిటీల గురించి మాట్లాడే అర్హత అనిల్‌కు లేదన్నారు. మైనారిటీ నాయకుడు అజీజ్ మేయర్ కావడానికి వీపీఆర్ సహాయం చేశారని తెలిపారు. ఖలీల్ అనే మైనారిటీ నేత డిప్యూటీ మేయర్ పదవిని తీసేసి, ఇప్పుడు తన కారు డోర్లు తీయడానికి పరిమితం చేసిన నీచ చరిత్ర అనిల్‌ది అని మండిపడ్డారు. మైనారిటీల సంక్షేమం కోసం మంత్రి నారాయణ రూ. 30 కోట్లు ఇస్తే, వీపీఆర్ రూ. 14 కోట్లు అధికారికంగా ఇచ్చారని, వారి పిల్లల చదువుల కోసం రూ. 20 కోట్లతో పాఠశాల నిర్మిస్తున్నామని వివరించారు.
ప్రసన్నకుమార్ రెడ్డి అక్రమ మైనింగ్‌పై విజిలెన్స్ విచారణ
కోవూరు మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి తలమంచి, పంచేడు, రాజుపాళెం ప్రాంతాల్లో చేసిన ఇల్లీగల్ మైనింగ్‌పై ఇంటెలిజెన్స్ ఐజీ నివేదికలు సిద్ధంగా ఉన్నాయని, త్వరలోనే ఆయన అక్రమాల జాతకం బయటపడుతుందని హెచ్చరించారు. ఓ కాంట్రాక్టరును ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి తెచ్చిన ఘనత ప్రసన్నదని, రూ. 85 లక్షల బ్యాంకు స్కామ్ వెనుక ఉన్న మస్తానయ్య వ్యవహారం త్వరలోనే తేలుతుందన్నారు. ప్రస్తుతం కోవూరులో ఎలాంటి అవినీతికి తావులేదని, కలెక్టర్ సూచనల మేరకే నిబంధనల ప్రకారం పోతిరెడ్డిపాళెంలో ఇసుక అందుబాటులోకి తెచ్చామని స్పష్టం చేశారు. వైసీపీ నేతల అసత్య ప్రచారాలకు, కుట్రలకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే కోలుకోలేని దెబ్బతీస్తారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి హెచ్చరించారు.

## వికసిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్ క్విజ్ పోటీల్లో యువత పాల్గొనాలి
## జిల్లా యువజన అధికారి నరసింహ కుమార్

**నెల్లూరు నగరం, సెప్టెంబర్ 10, జన సముద్రం జిల్లా ప్రతినిధి.**
వికసిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో జిల్లాలోని యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జిల్లా యువజన అధికారి ఏ.వి. నరసింహ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మేరా యువ భారత్‌నెల్లూరు కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి మాట్లాడుతూ, దేశ అభివృద్ధిలో యువత పాత్రను మరింత పెంపొందించడంతో పాటు, యువతలో నాయకత్వ లక్షణాలను, సాధారణ జ్ఞానాన్ని మరియు దేశం పట్ల అవగాహనను పెంపొందించే ఉద్దేశంతో వికసిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా యువత కోసం ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల యువత మై భారత్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ వివరాలను నమోదు చేసుకుని ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలని ఆయన సూచించారు. క్విజ్‌లో మొత్తం



20 ప్రశ్నలు ఉంటాయని, వాటికి సమాధానాలు ఇవ్వడానికి10నిమిషాలసమయంకేటాయించబడు తుందని తెలిపారు. క్విజ్‌ను విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం పాల్గొనేవారికి సర్టిఫికేట్ కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తుందని తెలిపారు. యువత తమ పరిజ్ఞానాన్ని పరీక్షించుకోవడంతో పాటు, వికసిత్ భారత్ నిర్మాణంపై మరింత అవగాహన పొందేందుకు ఈ క్విజ్ ఒక మంచి అవకాశమని పేర్కొన్నారు. ప్రస్తుత యువత దేశ భవిష్యత్తుకు కీలకమని, దేశ అభివృద్ధి, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా యువజన అధికారి తెలిపారు. యువత ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా తమ ప్రతిభను, ఆలోచనా విధానాన్ని మరింతగా అభివృద్ధి చేసుకోవచ్చని సూచించారు. ఈ నెల 30వ తేదీ క్విజ్‌లో పాల్గొనేందుకు చివరి గడువు అని జిల్లా యువజన అధికారి స్పష్టం చేశారు. గడువు సమీపిస్తున్నందున జిల్లాలోని అర్హత కలిగిన యువత ఎటువంటి ఆలస్యం చేయకుండా మై భారత్ వెబ్‌సైట్ ద్వారా క్విజ్‌లో పాల్గొనాలని కోరారు. క్విజ్ పోటీలకు సంబంధించిన పూర్తి వివరాలు, ఆన్‌లైన్‌లో పాల్గొనే విధానం తదితర సమాచారం కోసం మై భారత్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. అలాగే ఏవైనా సందేహాలు లేదా మరిన్ని వివరాల కోసం మేరా యువ భారత్‌నెల్లూరు కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలోని 1529 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వికసిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలో పాల్గొనాలని జిల్లా యువజన అధికారి ఏ.వి. నరసింహ కుమార్ కోరారు.

## జిల్లా కలెక్టర్ల సమావేశంలో

- డిజిటల్ కనెక్టివిటీ పై సమీక్ష.
- రాష్ట్రంలో మారుమూల గ్రామాలకూ వంద శాతం మొబైల్ కనెక్టివిటీ ఉండాలిడకలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశం.

**నెల్లూరు, సెప్టెంబర్ 10, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**
రాష్ట్రంలో డిజిటల్ కనెక్టివిటీ, మొబైల్ నెట్‌వర్క్ విస్తరణపై ఐటీ,ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ సమగ్రమైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికీ 4జీ,5జీ సేవలను నిరంతరాయంగా అందించేందుకు చేపట్టిన చర్యలను ఆయన వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల కింద బీఎస్ఎన్ఎల్, జియో సంస్థల ద్వారా రాష్ట్రానికి మొత్తం 1,023 టెలికాం టవర్లు మంజూరయ్యాయని తెలిపారు. వీటిలో ఇప్పటికే 143 చోట్ల పనులు పూర్తయి సిగ్నల్స్ వస్తున్నాయని, 428 చోట్ల పనులు జరుగుతున్నాయని, భూమి అప్పగించిన 423 ప్రాంతాల్లో పనులు మొదలుకావాల్సి ఉందని పేర్కొన్నారు. ఇంకా వివిధ జిల్లాల్లో 18 చోట్ల రెవెన్యూ భూమి, మరో 11 చోట్ల అటవీ భూముల క్లియరెన్స్ పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఈ వివరాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందిస్తూ టవర్ల ఏర్పాటులో జాప్యంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతాలతో సహా రాష్ట్రం నలుమూలలా కనెక్టివిటీ ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యమని, అవసరమైతే ఇన్సెంటివ్‌లు కూడా ఇస్తామని ముందే చెప్పినప్పుడు అధికారులు భూమి కేటాయింపుల్లో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. బాధ్యతను వేరొకరిపై నెట్టేసే పద్ధతి మానుకుని స్వయంగా బాధ్యత తీసుకుని పని చేయాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న 18 రెవెన్యూ స్థలాలను రాబోయే ఏడు రోజుల్లోగా టెలికాం సంస్థలకు అప్పగించాలని కలెక్టర్లకు గడువు విధించారు. అలాగే అటవీ అనుమతులు పెండింగ్‌లో ఉన్న చోట్ల, అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని పది రోజుల్లోగా క్లియరెన్స్ పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు చొరవ తీసుకుని ముందస్తుగా పనిచేయాలని, వచ్చే కలెక్టర్ల సదస్సు నాటికి మళ్లీ ఇలాంటి కారణాలు వినడానికి తాను సిద్ధంగా లేనని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా భూమి ఇవ్వడంతో పాటు విద్యుత్ ఖర్చులను భరిస్తూ తీసుకొచ్చిన 'వంద శాతం టెలికాం కనెక్టివిటీ' పథకం గురించి కూడా ఐటీ కార్యదర్శి వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,359 ప్రాంతాల్లో ఎయిర్‌టెల్, జియో, వొడాఫోన్-ఐడియా, బీఎస్ఎన్ఎల్ ద్వారా టవర్ల నిర్మాణాన్ని కేటాయించామని తెలిపారు. ఒక్కో టవర్‌కు కేవలం 5 నుంచి 5.5 సెంట్ల భూమి మాత్రమే అవసరమవుతుందని, కలెక్టర్లకే నేరుగా భూమి ఇచ్చే అధికారాలు ఉన్నందున ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపకుండా స్థానికంగానే త్వరగా అప్పగించాలని కలెక్టర్లను కోరారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ ఈ 2,359 సైట్లకు సంబంధించి నెల రోజుల్లోగా భూముల బదిలీ ప్రక్రియ పూర్తి కావాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. వచ్చే కలెక్టర్ల కాన్ఫరెన్స్ నాటికి రాష్ట్రంలో వంద శాతం కవరేజ్ సాధించాలని ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో ఒక్క గ్రామంలో కూడా సిగ్నల్ లేని పరిస్థితి



కనిపించకూడదని స్పష్టం చేశారు. రోడ్డు లేదనే కారణంతో టవర్ల నిర్మాణాన్ని ఆపవద్దని, ఉపాధి హామీ పథకం కిందైనా మట్టి రోడ్లను చదును చేసుకుని పనులు ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. టెలికాం అంశాలతో పాటు పలు ఇతర విభాగాల పనులపై కూడా ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. పేదల ఇళ్ల నిర్మాణానికి సంబంధించి గృహనిర్మాణ శాఖ కార్యదర్శి పది రోజుల్లో కార్యాచరణ ప్రణాళికతో రావాలని, ఏడాదిలోగా ఇళ్ల స్థలాల కేటాయింపు, ఏడాదిన్నరలోగా (2027 నాటికి) ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్లన్నీ పూర్తి కావాలని నిర్దేశించారు. అలాగే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 'వేస్ట్ టు వెల్త్' విధానంలో చెత్త రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని, ఎక్కడా చెత్త కనిపించకుండా పారిశుద్ధ్యం మెరుగుపడాలని చెప్పారు. వివిధ గ్రామాల్లో 90 శాతం పూర్తయి, చిన్నచిన్న పనుల వల్ల నిరుపయోగంగా పడి ఉన్న కమ్యూనిటీ భవనాలను గుర్తించి, వెంటనే వాటిని పూర్తి చేసి ప్రజల వినియోగానికి తీసుకురావాలని కలెక్టర్లను ఆదేశించారు.

## వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న సునీత నాయకర్, జన సైనికులు



**సెప్టెంబర్ 10 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్**

నరసాపురం నియోజకవర్గానికి చెందిన జనసేన నాయకులకు ఈరోజు ఉదయం తిరుమలలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామివారి నిజరూప దర్శనాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ సతీమణి సునీత నాయకర్ కల్పించారు. ఈ సందర్భంగా సునీత నాయకర్ శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక స్వామివారి యోగ ఆశీర్వచనం స్వీకరించారు. స్వామివారి దివ్య ఆశీస్సులతో ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని, నరసాపురం నియోజకవర్గం సుభిక్షంగా ఉండడంతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు.

## నాణ్యతా ప్రమాణాలతో భోజన పదార్థాలు ఉండాలి



**జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం ప్రతినిధి సుబ్రహ్మణ్యం. సెప్టెంబర్.10.**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పదార్థాలు నాణ్యతా ప్రమాణాలతో ఉండాలని ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ సూచించారు. గుడ్లవల్లేరు2 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, స్వయంగా భోజనాన్ని రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన మరియు రుచికరమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను పరిశీలించి, వాటిని సక్రమంగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, వారితో ప్రేమగా, ఆప్యాయంగా మెలగాలని, వారి సమస్యలను తెలుసుకుని తగిన విధంగా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల్లో ఆసక్తి, ఆత్మవిశ్వాసంపెంపొందించేలా బోధన కొనసాగించాలని ఇమ్రాన్ తెలిపారు.

## పౌష్టికాహారంతో రక్తహీనత మాయం

**జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం ప్రతినిధి సుబ్రహ్మణ్యం. సెప్టెంబర్.10.**



మండలంలోని అన్ని అంగన్వాడీ వాడి కేంద్రాల్లో ఈనెల 9వ తేదీ నుండి వచ్చే నెల అక్టోబర్ రెండో తేదీ వరకు కూడా పోషణ్ మాహ్ కార్యక్రమాలు జరుగుతాయని ఐసీడీఎస్ సూపర్వైజర్ అబ్దుల్ నసీరున్నీసా అన్నారు. గురువారం గుడ్లవల్లేరు ఎనిమిది అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి నసీరున్నిసా మాట్లాడారు. గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని అందువల్ల రక్తహీనత రాకుండా మాయమవుందన్నారు. అలాగే పిల్లలకు సీజనల్ వ్యాధులు రాకుండా ఉంటాయని వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పిల్లల్లో జ్ఞాపకశక్తి, శారీరకబలం పెరుగుతాయని చెప్పారు. అలాగే గుండె జబ్బులు, మధువేహం రాకుండా ఉంటాయన్నారు. ప్రతిరోజు ఇంట్లో వండిన సమతుల్య ఆహరం తీసుకోవాలన్నారు. జంకఫుడ్‌కు దూరంగా ఉండాలని అవగాహన కలిగించారు. అంగన్వాడీ కార్యకర్తలు నాగరాజకుమారి, జయలక్ష్మి, వాణి తదితరులు పాల్గొన్నారు

## పసలదీవి పంచాయతీ కార్యాలయం వద్ద కరెంటు స్తంభాల కరువు



- అధికారులు స్పందించకపోవడంతో కర్రలే ఆధారం
- ప్రమాదం పొంచి ఉందంటున్న గ్రామస్తులు

**నరసాపురం సెప్టెంబర్ 10 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్**

పసలదీవి పంచాయతీ కార్యాలయం వద్ద విద్యుత్ స్తంభాల కొరత గ్రామస్తులను ఆందోళనకు గురిచేస్తోంది. విద్యుత్ వైర్లను సక్రమంగా ఏర్పాటు చేయాల్సిన చోట స్తంభాలు లేకపోవడంతో గ్రామస్తులు తాత్కాలికంగా కర్రలను ఏర్పాటు చేసి వైర్లను నిలబెట్టుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక కర్రలను స్తంభాలుగా ఉపయోగించాల్సి వస్తోందని చెబుతున్నారు. పంచాయతీ కార్యాలయంలో ప్రస్తుతం సచివాలయం సేవలు కొనసాగిస్తున్న నేపథ్యంలో ప్రజల రాకపోకలు ఉండే నేపథ్యంలో ఈ విధంగా విద్యుత్ వైర్లు ఉండటం ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం జరిగినా ప్రమాదం జరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి పసలదీవి పంచాయతీ కార్యాలయం వద్ద అవసరమైన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి, వైర్లను సక్రమంగా అమర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపుతారా లేక కర్రలే విద్యుత్ స్తంభాలుగా కొనసాగుతాయా అన్నది వేచి చూడాల్సి ఉంది.

## వినాయక మండపాలకు ఆన్లైన్ అనుమతి తప్పనిసరి ఎస్ ఐ శివకుమార్

**రామాపురం జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 10**



వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్ ద్వారా అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి.ఎస్ ఐ శివకుమార్ తెలిపారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వినాయక విగ్రహాలకు మాత్రమే సంబంధిత శాఖల ద్వారా అనుమతులు మంజూరు చేయబడతాయి. అనుమతి లేకుండా వినాయక విగ్రహాలను ప్రతిష్ఠిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి.అని ఆయన పేర్కొన్నారు వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించే ప్రతి గ్రామంలో నిర్వాహకులు కమిటీగా ఏర్పడి, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని, పోలీస్ స్టేషన్ ద్వారా అవసరమైన అనుమతులు తీసుకోవాలని తెలిపారు అలాగే వినాయక విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించిన ప్రదేశం, నిమజ్జనం జరిగే ప్రదేశం మరియు ఇతర వివరాలను ముందుగానే తెలియజేయాలి.వినాయక చవితి మరియు నిమజ్జన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి. పోలీస్ శాఖ సూచించే భద్రతా నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు మరియు ఇతర సూచనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలి.అందరూ సహకరించి వినాయక చవితి పండుగను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించుకోవాలని తెలియజేసారు

## ఆత్మహత్యలను నివారిద్దాం - చేతికి చేతితో సహాయంలి లికే శ్యాంప్రసాద్

**జన సముద్రం న్యూస్ పల్నాడు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10**





పల్నాడు జిల్లా మానసిక ఆరోగ్య కౌన్సిలర్ల అద్వర్యం లో ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా నరసరావుపేటలో లో అవగాహన సదస్సు మరియు ర్యాలీ ని 10 సెప్టెంబర్ 2026న నిర్వహించామని పల్నాడు జిల్లా విద్యాశాఖ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె. శ్యాం ప్రసాద్ తెలిపారు.

కార్యక్రమం ప్రారంభంలో విద్యార్థులు మున్సిపల్ గర్ల్స్ హై స్కూల్ నుండి ప్రారంభమైన ర్యాలీలో పాల్గొని "ఆత్మహత్యలను నివారిద్దాం చేతికి చేతితో సహాయం" వంటి నినాదాలతో పాదయాత్ర నిర్వహించారు. ర్యాలీ అనంతరం మున్సిపల్ గర్ల్స్ హై స్కూల్ లోటే ఆత్మహత్య నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు ఒక జట్టుగా నిలబడుతూ ఆత్మహత్యల నిరోధం లో తమ ప్రత్యేక బాధ్యతను ఒప్పుకుని ప్రతిజ్ఞ వ్యక్తం చేయించారు.

పల్నాడు జిల్లా గైర్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ పూర్ణచంద్రరావు మరియు అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె. శ్యాం ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొని ఆత్మహత్య నిరోధక చర్యలు ప్రతి సంఘంలో ప్రతి వ్యక్తి బాధ్యతగా భావించే విధంగా విజ్ఞప్తి చేశారు. వారు క్షణిక ఆవేశం తో బలి తీస్తూ జీవితాన్ని ఖర్చు చేయడం యువతలో పెరిగే మానసిక ఒత్తిడే కారణమైందని, మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించినపుడే ఆత్మహత్యలను తగ్గించగలమని విద్యార్థులకు వివరించారు.

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకొని, ఇబ్బంది ఉన్నప్పుడల్లా పరిష్కారానికి కౌన్సిలింగ్ తీసుకుంటామని, ఆత్మహత్యకు పన్నువేయదామని సంకల్పించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా మానసిక ఆరోగ్య కౌన్సిలర్లు ప్రేమ్ కుమార్, ఫణీంద్ర కుమార్, అశోక్, శాతివర్ధన్, చందన, నవ్య, కృష్ణారావు, జగన్నాధ్ కుమార్, సులేమాన్, శ్రీనివాసరావు, శ్రీలేఖ, దీప్తి తదితరులు పాల్గొనగా స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు మరియు వ్యాయామ ఉపాధ్యాయురుడు కూడా ఉన్నారు.

అనంతర వివరాల కోసం పల్నాడు జిల్లా విద్యాశాఖ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె. శ్యాం ప్రసాద్ సంప్రదించవచ్చు.

## ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి నిర్వహించాలి

- డీజే లకు అనుమతి లేదు
- ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు

**ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్, సెప్టెంబరు 10:**



వినాయక చవితి ఉత్సవాలను ఒంటిమిట్ట సర్కిల్ పరిధిలో ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిర్వహించుకోవాలని ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు కోరారు. ముందుగా ఒంటిమిట్ట సర్కిల్ పరిధిలో ప్రజలందరికీ ఆయన వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే వినాయక విగ్రహాలకు సంబంధించి నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు అనుమతి తీసుకోవాలని సూచించారు. విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించిన వివరాలతో పాటు ఎన్ని రోజులు ఉత్సవాలు నిర్వహిస్తారు, ఎప్పుడు నిమజ్జనం చేస్తారు, నిమజ్జనం ఎక్కడ నిర్వహిస్తారనే సమాచారాన్ని ముందుగానే పోలీసు శాఖకు తెలియజేయాలన్నారు.

కులమతాలకు అతీతంగా గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో పండుగను జరుపుకోవాలని సూచించారు. వినాయక విగ్రహాల వద్ద భద్రత కోసం నిర్వాహకులు 24 గంటలూ ఇద్దరు చొప్పున అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లపై పోలీసు, సంబంధిత శాఖల అధికారులు దృష్టి సారిస్తున్నారని తెలిపారు. నిమజ్జనం నిర్వహించే ప్రదేశాలను ఇప్పటికే పరిశీలిస్తున్నామని, వినాయక విగ్రహాలను ఎక్కడ నిమజ్జనం చేయాలనే విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తామని సీఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ప్రజలు, ఉత్సవ కమిటీలు పోలీసు శాఖకు సహకరించి వినాయక చవితి వేడుకలను శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## లైసెన్స్‌తో డ్రైవింగ్.. హెల్మెట్‌తో ప్రయాణం.. సురక్షితంగా ఇంటికి చేరాలి

### రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి ఎమ్మెల్యే డా. కామినేని శ్రీనివాస్.

**జన సముద్రం న్యూస్ ప్రతినిధి వి. కె. ఆర్.ఏలూరు జిల్లా,కైకలూరు నియోజవర్గం సెప్టెంబర్ 10:**





డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, సరైన అనుభవం లేకుండా వాహనాలు నడపడం వల్ల అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, కైకలూరు శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ గారు అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని ఆయన సూచించారు.

కైకలూరు మండలంలోని కైకలూరు సీతారామ కళ్యాణ మండపంలో గురువారం పోలీస్ మరియు రవాణా శాఖల అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ డ్రైవింగ్ లైసెన్స్‌యల్,యల్,ఆర్ మేళా కార్యక్రమంలో డా. కామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, నిబంధనలు ఉల్లంఘించే వారు ప్రభుత్వ చట్టపరమైన చర్యలకు గురికావాల్సి ఉంటుందని తెలిపారు. ప్రజలకు డ్రైవింగ్ లైసెన్స్ అవసరంపై అవగాహన కల్పించడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరూ సులభంగా యల్,యల్,ఆర్ , డ్రైవింగ్ లైసెన్స్ పొందేలా ఈ ప్రత్యేక మేళాను కైకలూరులో ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

అజాగ్రత్తే ఎన్నో కుటుంబాలకు శాపం

రోడ్డు ప్రమాదాల్లో ప్రతిరోజూ ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని కామినేని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని ప్రమాదాలను చూస్తే హృదయం పగిలిపోతుందని అన్నారు. కొందరు తమ అజాగ్రత్త కారణంగా ప్రాణాలు కోల్పోతుండగా, మరికొందరి నిర్లక్ష్యం కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు.

హెల్మెట్ ధరించకపోవడం, అతివేగం, వాహన పరిమితికి మించి ప్రయాణించడం, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి వాటి వల్ల ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని సూచించారు. జరిమానా కంటే అవగాహన ముఖ్యం

హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారిపై కేవలం జరిమానాలు విధించడం కంటే, వారికి అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కామినేని అధికారులకు సూచించారు. హెల్మెట్ లేని వారికి సమీపంలోనే హెల్మెట్ దుకాణాలు ఏర్పాటు చేసి, నాణ్యమైన హెల్మెట్లు కొనుగోలు చేసేలా ప్రోత్సహించాలని కోరారు. ఈ సూచనకు సభలోని వారందరూ కరతాళ ధ్వనులతో మద్దతు తెలిపారు.

ప్రతి కుటుంబం సురక్షితంగా ఉండాలంటే ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కామినేని శ్రీనివాస్ అన్నారు. "లైసెన్స్‌తో డ్రైవింగ్.. హెల్మెట్‌తో ప్రయాణం.. సురక్షితంగా ఇంటికి చేరడం" ప్రతి వాహనదారుడి లక్ష్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ శాసనమండలి సభ్యులు కమ్మిలి విఠల్ రావు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పోలీస్ శాఖ, రవాణా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు ఎమ్మెల్యేలతో గ్రామం మరింత అభివృద్ధి..!

- రైతాంగ సంస్కరణలపై టీడీపీ పునాదులు..!
- మంచికల్లు గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, సెప్టెంబర్ 10;**



రెంటచింతల మండలంలోని మంచికల్లు గ్రామానికి ఏ నియోజకవర్గానికి లేని విధంగా ఇద్దరు ఎమ్మెల్యే ఉన్నారని, ఒకవైపు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మరోవైపు తాను గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నామని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. గురువారం గ్రామంలో పర్యటించిన ఆయన ముందుగా శ్రీ చౌడేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత ఆలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ పాఠశాల నందు నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. అనంతరం గ్రామ ప్రధాన కూడలిలో ఉన్న స్వర్గీయ యరపతినేని లక్ష్మయ్య విగ్రహానికి పూలమాల వేసి, నివాళు లర్పించారు. గ్రామంలో కొలువుదీరిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థాన నిర్మాణానికి టీటీడీ వారి శ్రీవాణి ట్రస్ట్ ద్వారా మంజూరైన రూ. 40 లక్షల నిధులతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తరువాత గ్రామంలో ఏర్పాటు చేసిన మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో పాల్గొని, 729 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కరణ ప్రదాత అన్న నందమూరి తారక రామారావు చేపట్టిన పట్టదారు పాసుపుస్తకాలు రూపాయి ఖర్చులేకుండా ఇంటికి వచ్చేవని, అదే స్ఫూర్తితో నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు రిసర్వే ద్వారా రైతులకు రాజముద్రతో కూడిన పాసుపుస్తకాలను అందజేస్తున్నారని చెప్పారు. గ్రామీణాభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రెండేళ్ల పాలనలో కోట్లాది రూపాయలతో మంచికల్లు గ్రామానికి ఖర్చు చేశామని వివరించారు. అలానే గ్రామంలో కులాలు వారీగా స్మశాన భూములను అందించి, సమ ప్రాధాన్యత కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దీప్తి, టీడీపీ నాయకులు లింగా బ్రహ్మయ్య, చపారవు అబ్బిరెడ్డి, శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి, అల్లం బ్రహ్మారెడ్డి, పోట్ల నరసింహారావు, మద్దిగపు వెంకటరామిరెడ్డి, మందలపు హనిమిరెడ్డి, మున్నా ప్రభురాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి ఆరాధన... ఆధ్యాత్మిక చింతన

**- కలబోసి గ్రామ దేవత పోచమ్మ పూజలు**

**- నేడుపొలాల అమావాస్య**


డాక్టర్ కోహెడ ప్రసాదరావు శర్మ (యం.ఎ. పి. హెచ్. డి.జ్యోతిషం, జ్యోతిష పండితులు & సీనియర్ జర్నలిస్ట్)

భారతీయ సనాతన సంప్రదాయంలో పండుగలు, వ్రతాలు కేవలం పూజాదికాలకు మాత్రమే పరిమితం కాకుండా ప్రకృతితో మమేకమై జీవించాలని విశిష్ట సందేశాన్ని అందిస్తాయి. ఈ కోవలోనే శ్రావణ మాసములోని బహుళ అమావాస్య రోజున పొలాల అమావాస్య పండుగను జరుపుకుంటారు. ఈ సంవత్సరం అమావాస్య శుక్రవారం ఉండడంతో భక్తి ప్రపత్తులతో పొలాల అమావాస్య పండుగను జరుపుకునేందుకు సమాయుత్తమవుతున్నారు.

కొన్ని వర్గాలకు చెందిన వారు కంద మొక్కను కూడా ప్రధానంగా పూజించడం ఆచారంగా వస్తుంది. ముఖ్యంగా బ్రాహ్మణ వర్గానికి చెందిన గృహాల్లో ఈ పండుగకు విశేషమైన ప్రాముఖ్యత ప్రాధాన్యత ఉంది. సంతానం కలిగిన స్త్రీలు తమ సంతానం ఆయురారోగ్యములతో, అష్టైశ్వర్యములతో తుల తూగాలని అలాగే వంశాభివృద్ధి జరగాలని కాంక్షిస్తూ, ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. ప్రధాన దైవంగా పోచమ్మ తల్లిని కొలవడం ఈ పండుగ యొక్క ప్రాముఖ్యత. వర్ష రుతువు ప్రారంభమై వర్ష సమృద్ధి తో ఈ మాసములో నదీ నదులు జలకళలతో ఉంటాయి. పైగా వాతావరణంలో పెనుమార్పుల వలన అంటూ వ్యాధులు, పలు రోగాలు ఈ సమయములో వ్యాప్తి చెందడం అధికంగా ఉంటుంది. అలాగే పంటలు సహితం పొట్ట దశకు చేరుకొని చీడపీడలతో నష్టాన్ని కలిగించే వాతావరణ ఈ సమయంలో ఉంటుంది. ఈ రుగ్మతల నుండి అటు తమ పంటలను, ఇటు తమ పిల్లల ఆరోగ్యాలను బాగుండాలని కోరుతూ,



అలాగే పాడి పంటలకు కీలకమైన పశుసంపద వృద్ధి చెందాలని ప్రార్థిస్తూ పోచమ్మ తల్లిని ప్రధాన దైవంగా పూజించే పండుగ పొలాల అమావాస్య. తమ పూజా మందిరంలో ని గోడలకు ఆవుపేడ, గంధం, పసుపు లతో వ్యవసాయ సంబంధమైన వరి కంకులు, పశువుల కాపరి, ఎడ్లను పోలిన చిత్రములను తీర్చిదిద్దుతారు. వీటికే పూజాదికాలు చేయటంతో పాటు, మట్టితో పశువుల కాపరి ఎడ్లను కూడా చేసి పూజా మందిరంలో పెట్టి పూజించడం ఈ పండుగలో ముఖ్యమైన ఘట్టం. పొట్లకాయలు, కంకులు పిల్లల వస్త్రములు కంకణాలను పెట్టి పూజించడం ఇందులో ప్రత్యేకత. అనేక రకాల వంటకాలతో పాటు పిండి వంటలు, పాయసం, భక్షాలు లాంటి ప్రత్యేకమైన వంటలు వండి పోచమ్మ తల్లికి నివేదన చేయడం ఆచారంగా వస్తుంది. ఈ సమయములో ప్రతి ఇంట్లో అధికంగా చేరే ఈగలకు ప్రత్యేకంగా నైవేద్యం నివేదించడం విశేషం. అలాగే గ్రామంలోని పోచమ్మ గుడికి సైతం వెళ్లి పూజాదికాలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పిస్తారు. అమ్మవారికి ఓడి బియ్యం సమర్పిస్తారు. ముత్తైదువులను పేరంటానికి పిలిచి ఆమెకు తోరము (పూజించిన కంకణం)కట్టి అమ్మవారి స్వరూపముగా పూజాదికాలు గావించి



భోజనం పెట్టి వాయనం సమర్పిస్తారు. ఈ పండుగలో ముఖ్యంగా కథ ప్రధానంగా ఆసక్తికరముగా ఉంది. ఒక బ్రాహ్మణ మహిళకు సంతానం కలుగుతున్న పిల్లలు దక్కకపోవటంతో ఆమె తీవ్ర దుఃఖానికి లోనవుతుంది. తనకు పుట్టిన సంతానం మరణిస్తుండడంతో గ్రామ పొలిమేరలోని పోచమ్మ ఆలయం చుట్టూ ఖననం చేస్తూ వస్తుంది. తీవ్ర దుఃఖంతో బాధతో తనకు కలుగుతున్న దురదృష్టానికి చింతిస్తూ అమ్మవారిని వేడుకున్న సందర్భముగా ఆమెకు పోచమ్మ తల్లి కలలో కనబడి పూర్వజన్మలో పొలాల అమావాస్య రోజున అమ్మవారికి నివేదన చేయకుండా పేరంటానికి పిలిచిన ముత్తయిదువ రాకముందే పిల్లలు ఏడుస్తున్నారని భోజనం చేయడంతో వ్రతభంగమై ఈ జన్మలో ఇలా పిల్లలు దక్కకుండా పోతున్నారని చెబుతుంది. తిరిగి నిష్ఠతో విధివిధానంగా ఆచరించిన ఫలితం కలుగుతుందని స్వప్నం లో అమ్మవారు చెప్పడం వల్ల పొలాల అమావాస్య రోజున సదరు బ్రాహ్మణ మహిళ ఆచారముతో పాటు సంప్రదాయముగా ఈ వ్రతాన్ని నోమి పోచమ్మకు పేరంటానికి వచ్చిన ముత్తైదువకు భోజనం పాయసం ఇచ్చి తిరిగి తన సంతానాన్ని పొందిన కథ ప్రాచుర్యంలో ఉంది. ఒకవైపు ప్రకృతి ఆరాధన మరకవైపు ఆధ్యాత్మిక చింతనతో కూడిన ఈ వ్రతం తెలంగాణ ప్రాంతంలోని మహిళలు వైభవంగాను ఘనంగాను జరప కొంటున్నారు.

# తీదేడులో కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో ఘనంగా ఉచిత వైద్య శిబిరం





**చింతపల్లి, సెప్టెంబర్ 10 (జనసముద్రం న్యూస్ ప్రతినిధి):** చింతపల్లి మండలం తీదేడు గ్రామంలో హైదరాబాద్ కామినేని హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి ప్రారంభించారు. శిబిరంలో కామినేని హాస్పిటల్‌కు చెందిన నిపుణులైన వైద్యులు గ్రామ ప్రజలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వివిధ వ్యాధులపై వైద్య సలహాలు, అవసరమైన మందులు, చికిత్స సూచనలు అందించారు. గ్రామీణ ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లకుండా తమ గ్రామంలోనే నాణ్యమైన వైద్య సేవలు పొందడం శిబిరం ప్రత్యేకతగా నిలిచింది.

**ఈ సందర్భంగా సర్పంచ్ స్వప్న శేఖర్ రెడ్డి మాట్లాడుతూ,**

ప్రజల ఆరోగ్య పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని, ఇలాంటి ఆరోగ్య శిబిరాలు గ్రామీణ ప్రాంతాలకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. కామినేని హాస్పిటల్ యాజమాన్యం, వైద్యులు, సిబ్బందికి గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మయాదగిరి, మాదగోని కృష్ణగౌడ్, గంటెల అలివేలుసోమయ్య, దాసరి కళమ్మముత్తయ్య, రెడ్డి పద్మపరమేష్, శివర్ల పర్వతాలు యాదవ్, కామినేని హాస్పిటల్ వైద్య బృందం, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ పరిధిలో రాజకీయ ఫ్లెక్సీలకు స్థానం లేదు: సర్పంచ్ స్వప్న శేఖర్ రెడ్డి




**చింతపల్లి, సెప్టెంబర్ 10 (జనసముద్రం న్యూస్ ప్రతినిధి):** తీదేడు గ్రామపంచాయతీ కార్యాలయ పరిధిలో ఎలాంటి రాజకీయ పార్టీకి చెందిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడానికి అనుమతి లేదని గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. బీజేపీ నాయకులు ఫ్లెక్సీ తొలగింపుపై ఎంపీడీవో, చింతపల్లి సబ్‌ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, దీనిపై సర్పంచ్ రీ-పిటిషన్ సమర్పించి తన వివరణ ఇచ్చారు. గ్రామపంచాయతీ కార్యాలయం అన్ని పార్టీలకు, అన్ని వర్గాల ప్రజలకు చెందిన ప్రభుత్వ కార్యాలయమని, అక్కడ రాజకీయ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల అనవసర వివాదాలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. గ్రామంలో శాంతియుత వాతావరణం, ప్రభుత్వ కార్యాలయాల గౌరవాన్ని కాపాడటమే తమ ఉద్దేశమని, ఎలాంటి రాజకీయ కక్షతో ఫ్లెక్సీని తొలగించలేదని ఆమె తెలిపారు. ఈ వ్యవహారాన్ని వాస్తవాల ఆధారంగా సమగ్రంగా పరిశీలించి బీజేపీ నాయకుల ఫిర్యాదును పునఃపరిశీలించాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు బొడ్డు పార్వతమ్మ, మాదగోని కృష్ణగౌడ్, గంటెల అలివేలు, దాసరి కళమ్మ, రెడ్డి పద్మ పరమేష్, శివర్ల పర్వతాలు యాదవ్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కోదండరాముని సన్నిధిలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి

## ఆలయంలో ప్రత్యేక పూజలు.. అభివృద్ధి పనులపై ఆరా



**ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్, సెప్టెంబర్ 10 :** : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయాన్ని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటిఅమర్‌నాథ్‌రెడ్డి గురువారం సందర్శించారు.



ఆలయంలో కోదండరామస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు వీణ రాఘవాచార్యులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.


అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఆలయంలో కొనసాగుతున్న పనుల వివరాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ఆలయం ఎదురుగా ఉన్న శ్రీ సంజీవనయ స్వామివారిని ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు టి. శివారెడ్డి, మైనార్టీ నాయకుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, తుమ్మలపెంట శీను, యువ నాయకుడు రవి రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చింతపల్లి సాయిసన్నిధిలో మాజీ ఎంపీ జితేందర్ రెడ్డికి ఘన సత్కారం



**చింతపల్లి, సెప్టెంబర్ 10 (జనసముద్రం న్యూస్ ప్రతినిధి):** చింతపల్లి మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ సాయిసన్నిధి ఆలయాన్ని మాజీ పార్లమెంట్ సభ్యుడు, ప్రస్తుతం ఒలింపిక్ కమిటీ సభ్యుడిగా సేవలందిస్తున్న శ్రీ జితేందర్ రెడ్డి బుధవారం సందర్శించి శ్రీ షిర్డీ సాయిబాబా స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.

జితేందర్ రెడ్డితో పాటు మాజీ ఆర్టీసీ యూనియన్ అధ్యక్షుడు అశ్వద్ధామ ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న అతిథులకు సాయిసన్నిధి ఆలయ కమిటీ సభ్యులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జితేందర్ రెడ్డి సాయిబాబా ఆశీస్సులు పొందుతూ రాష్ట్ర ప్రజల సుఖశాంతి, అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు.

ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సాయిసన్నిధి ఆలయ ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాల గురించి అతిథులకు వివరించారు. ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని జితేందర్ రెడ్డి పేర్కొన్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిసన్నిధి ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సానుకూల అభిప్రాయంలో నెల్లూరు జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానం

**- నెల్లూరు జిల్లా 76.6 శాతం స్కోర్‌తో రాష్ట్రంలో ప్రథమ ర్యాంకు**

**- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను ప్రత్యేకంగా అభినందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

**నెల్లూరు, సెప్టెంబర్ 10: జనసముద్రం జిల్లా ప్రతినిధి..**

ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అందించడంలో నెల్లూరు జిల్లా సాధిస్తున్న ప్రగతికి మరో గుర్తింపు లభించింది.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలో గురువారం జరిగిన జిల్లా కలెక్టర్ల 8వ సమావేశంలో జిల్లాల వారీగా ప్రజల సానుకూల అభిప్రాయాల (పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్)పై నిర్వహించిన సమీక్షలో ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా 76.6 శాతం స్కోర్‌తో రాష్ట్రంలో ప్రథమ ర్యాంకు సాధించింది.

ఈ సందర్భంగా ప్రజల సానుకూల అభిప్రాయంలో నెల్లూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం పట్ల జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

జిల్లా యంత్రాంగం సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ సాధించిన ఈ ఫలితాన్ని ప్రశంసించిన ముఖ్యమంత్రి, ఇదే స్ఫూర్తితో మరింత వేగంగా జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని



సూచించినట్లు సమీక్షలో పేర్కొన్నారు.

జిల్లాలో ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు, వివిధ శాఖల పనితీరుపై ప్రజల్లో ఏర్పడిన సానుకూల అభిప్రాయానికి ఈ ఫలితం నిదర్శనంగా నిలిచింది. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం సమన్వయంతో, నిరంతర పర్యవేక్షణతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చేస్తున్న కృషికి ఇది ప్రతిబింబంగా నిలిచింది.

ప్రత్యేకంగా ఎస్ఏపీపీ కార్యక్రమంలో పాజిటివ్ పర్సెప్షన్ 67.5 శాతం నుంచి 84.2 శాతానికి, ఎఫ్‌లైన్ సర్వేలో 70.6 శాతం నుంచి 81.4 శాతానికి, ఆర్ఓఆర్ మ్యుటేషన్లలో 68.5 శాతం నుంచి 78.5 శాతానికి గణనీయంగా పెరిగింది. ఆసుపత్రుల పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ సేవలు, గృహ నిర్మాణ పథకం, ఇసుక, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, పారిశుధ్యం, పాఠశాల విద్య తదితర అంశాల్లోనూ ప్రజల సానుకూల అభిప్రాయం మెరుగుపడింది.

పాఠశాల విద్యకు సంబంధించిన ప్రజల సానుకూల అభిప్రాయం 84.4 శాతం నుంచి 86.2 శాతానికి, 36 ఏళ్ల చిన్నారుల సేవలపై 78.7 నుంచి 80.7 శాతానికి, గర్భిణీలు, బాలింతల సేవలపై 83.3 నుంచి 84.5 శాతానికి పెరిగింది. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ ఆసుపత్రి సేవలు కూడా 76.2 నుంచి 81.2 శాతానికి మెరుగుపడ్డాయి. కాలుష్య నియంత్రణ మండలి సేవలు 95.8 శాతం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 90.9 శాతం, పట్టణ అన్న క్యాంటీన్లు 85.9 శాతం, రీ-సర్వే 85 శాతం, రేషన్ పంపిణీ 84.5 శాతం, ఇసుక సేకరణ 83.4 శాతం సానుకూల అభిప్రాయాన్ని సాధించాయి.

రాష్ట్రంలోని 28 జిల్లాల పనితీరును పరిశీలించిన ఈ సమీక్షలో నెల్లూరు జిల్లా 76.6 శాతం పాజిటివ్ పర్సెప్షన్‌తో మొదటి స్థానంలో నిలవడం జిల్లా కలెక్టర్ నాయకత్వంలో జిల్లా యంత్రాంగం పనితీరుకు, అధికారుల సమష్టి కృషికి, క్షేత్రస్థాయి సిబ్బంది అంకితభావానికి, ప్రజల సహకారానికి నిదర్శనంగా నిలిచింది.

ప్రజలసంతృప్తినేపరిపాలనకు ప్రధాన కొలమానంగా తీసుకుని,ప్రభుత్వసేవలను మరింత పారదర్శకంగా, వేగంగా ప్రజలకు చేరువ చేయడంతో పాటు, ముఖ్యమంత్రి ఇచ్చిన ప్రోత్సాహంతో ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ జిల్లాను అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని కలెక్టర్ అన్నారు.

# మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం.

## అపిలేపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల అవగాహన.



**అపిలేపల్లి, సెప్టెంబర్ 10, జనసముద్రం న్యూస్:** మండల పరిధిలోని అపిలేపల్లి ప్రాథమిక పాఠశాలలో వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అపిలేపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 14న జరగనున్న వినాయక చవితిని పురస్కరించుకుని గ్రామ ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని కోరారు.

ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు స్వయంగా తయారు చేసిన మట్టి వినాయక విగ్రహాలను పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులకు పంపిణీ చేశారు. మట్టి విగ్రహాలను నిమజ్జనం చేసిన అనంతరం అవి సహజంగా నీటిలో కలిసిపోవడంతో నీటి కాలుష్యం తగ్గుతుందని విద్యార్థులు వివరించారు.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల నిమజ్జనం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, జలచరాలకు హాని కలిగే ప్రమాదం ఉందని ప్రజలకు అవగాహన కల్పించారు.

వివేకానంద కబ్ ప్యాక్ విద్యార్థులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి మట్టి వినాయకుడి ఆవశ్యకతపై ప్రచారం నిర్వహించారు. విద్యార్థుల అవగాహనతో తాము కూడా మట్టి వినాయకుడినే పూజిస్తామని పలువురు తల్లిదండ్రులు తెలిపారు.

“మట్టి వినాయకుడు పర్యావరణానికి మేలు, మన భవిష్యత్తుకు భరోసా” అని పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అనంతపురం జిల్లా కార్యదర్శి బి. బొమ్మయ్య పేర్కొన్నారు.

కార్యక్రమాన్ని అపిలేపల్లి ఉన్నత పాఠశాల సముదాయం చైర్మన్ బి.సి. తిమ్మప్ప అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హనుమంతరాయుడు, నాగేశ్వరి, సురేష్, రాజా తదితరులు పాల్గొన్నారు.

H.O. Mobile : 9494184136
JANASAMUDRAM NEWS
Telugu Daily
RNI APTEL : 16151
జనసముద్రం న్యూస్
ప్రతి అక్షరం జనం కోసం
Published by Rajeshwari Publications
www.janasamudram.com fb/janasamudram 9494184136

RNI:APTEL/2021/16151
జనసముద్రం న్యూస్
Telugu Daily
जनासमुद्रम न्यूस Janasamudram News జన సముద్రం న్యూస్
విలేఖరులు కావలెను
జనసముద్రం న్యూస్ పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..
www.janasamudram.com
www.epaper.janasamudram.com
సంప్రదించండి..9494184136

Published by Rajeshwari Publications,D.No.4-3-99-1,Anantapur 515001 Rege: R.N.I.No APTEL / 2021 / 16151 for Queries Contact us @ 94941 84136, janasamudram2021@gmail.com. Follow us on www.janasamudram.com,fb / janasamudram